22-09Pg1exHMNWJQEBPRCKLT.qxdo/p:22-09Pg1exHMNWJQEBPRCKLT.qxd 1/1/02 6:57 AM Page 1





తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

శ్రీకాకుళం

epaper.vaartha.com WWW.VAARTHA.COM

: fb.com/vaartha Digital

Published from Srikakulam ,Visakhapatnam,Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem

22-9-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 233 పేజీలు: 16 వెల: 6.50







# ధైర్యముంటే అసెంబ్లీకి రండి

>> రిజరా ్వయర్లలో నీళ్ల నిండలేదన్నారు. వర్షాలు కూడా కురిస్తే కుంభవృష్టి లేకుంటే అనావృష్టిగా మారాయన్నారు. నేపాల్‌లో వరదలు సంభవించాయని గుర్తు చేశారు. దక్షిణాది రాష్ట్రాల్లో సరైన వర్షాలు లేవని పేర్కొన్నారు. కొన్ని చోట్ల తాగేందుకు నీళ్ల లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతులు కూడా పంటలకు ఎరువుల వాడకం తగ్గించాలని సిఎం సూచించారు.

పంటల ఖర్చు కూడా తగ్గించుకోవాలని ఆదాయం వచ్చే ప ంటలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. వరి సాగుకు బదులు మిల్లెట్‌, చిరుధాన్యాలు సాగు చేయాలన్నారు. రైతుల్ని కాపాడుకోవడం తమ బాధ్యత అన్నారు. రాష్ట్రంలో కరువు నివారణ చర్యలు చేపడ్తామన్నారు. సంక్షోభాన్ని అవకాశంగా తీసుకుందామన్నారు. ప్రస్తుతం మనుషులకు నీళ్ల అందించడంతో పాటు పశువులను సంరక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. పశుగ్రాసం పెంపుకు చర్యలు చేపట్టామన్నారు. మన భవిష్యత్తు మనచేతుల్లోనే ఉందన్నారు. మార్చిలోగా రైతుల భూసమస్యలను పరిష్కరిస్తామని సిఎం స్పష్టం చేశారు. రైతుల భూములకు బ్లాక్‌చైన్‌ టెక్నాలజీ సాయంతో రక్షిస్తామన్నారు.

ఈసందర్భంగా సిఎం చంద్రబాబునాయుడు కుప్పంలో 289.5కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, 38.5కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో ఇన్‌చార్జ్‌ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, ప్రభుత్వవిప్‌, ఎమ్మెల్సీ డాక్టర్‌ కంచర్ల శ్రీకాంత్‌, జిల్లా కలెక్టర్‌ సుమిత్‌కుమార్‌, కడ పి.డి. వికాస్‌ మర్మత్‌, జాయింట్‌ కలెక్టర్‌ ఆదర్శ్‌ రాజేంద్రన్‌, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్‌ పిఎస్‌ మునిరత్నం, పికె ఎం ఉడా ఛైర్మన్‌ డాక్టర్‌ బిఆర్‌ సురేష్‌బాబు, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, ఎపిఐఐసి డైరెక్టర్‌ ప్రేమ్‌కుమార్‌,టిడిపి జిల్లా అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



సోమవారం కుప్పంలో అభివృద్ధి పనులకు శంకుస్థాన చేస్తున్న సిఎం చంద్రబాబునాయుడు

## అభివృద్ధి చేసింది మేమే

>> సౌకర్యాలను అందుబాటులోకి తీసుకు వస్తోందని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాకు ప్రస్తుతం అనేక ప్రాజెక్టులు వరుసగా వస్తున్నాయని కేంద్ర మంత్రి అన్నారు. అతి త్వరలో మూలపేట పోర్టును పూర్తి చేస్తామని, పలాస ఎయిర్‌పోర్టు కూడా కార్యరూపం దాల్చుతుందని ధీమా వ్యక్తం చేశారు. నేరడి బ్యారేజీ, రెండో కేంద్రీయ విద్యాలయం, శ్రీకాకుళం జిల్లా నుంచి తిరుపతికి రైలు, రైల్వే జోన్‌ వంటి గతంలో అసాధ్యంగా భావిం చిన అనేక కార్యక్రమాలను సాకారం చేస్తున్నామని తెలిపారు. జిల్లా అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను మరింత బలోపేతం చేస్తామని రామ్మోహన్‌ నాయుడు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్‌ శివ్వల సూర్యనారాయణ, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తమ్మినేని సుజాత, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్‌, మండల టిడిపి అధ్యక్షుడు అంబాల్ల రాంబాబు, మార్క్‌ఫెడ్‌ డైరెక్టర్‌ ఆనెపు రామకృష్ణ, వంశధార ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్‌ అరవల రవీంద్ర, సనపల ఢిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

22-09-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం, ఉత్తర కార్తె,
తి. ఏకాదశి రా.9.40, న.ఉత్తరాషాఢ ఉ.7.06
వ.ఉ.11.26 - మ.1.10
దు.ఉ.8.22 - ఉ.9.11
రాహు.మ.3.00-4.30
శుభ స. ఉ.7.30-ఉ.8.00

## వార్తాఫలం

**మేషం:** దూరప్రాంతాలలోని ఆత్మీయు వర్గంతో సంభాషణలు సాగిస్తారు. సాహసోపేతమైన నిర్ణయాలను తీసుకుంటారు.

**వృషభం:** క్షణం తీరిక లేకుండా కాలాన్ని గడుపుతారు. దైవ దర్శనం చేసుకుంటారు. నిరుద్యోగులకు నూతన ఉద్యోగావకాశాలు.

**మిథునం:** ప్రకృతి వైద్యం పట్ల మక్కువను చూపుతారు. క్లిష్టమైన సమస్యలకు కూడా కొన్ని పరిష్కారమార్గాలు లభిస్తాయి.

**కర్కాటకం:** వ్యక్తిగత ప్రతిష్ఠను పెంపొందించు కోవడానికి ప్రాముఖ్యత నిస్తారు. రాజకీయాలు ఆకర్షిస్తాయి.

**సింహం:** ఉద్యోగాభివృద్ధిని సాధించు కోవడానికి గాను క్రొంగొత్త మార్గాలను అవలంభిస్తారు. స్వల్ప ధనలాభ సూచన.

**కన్య :** జీవిత భాగస్వామి సలహాలను పరిగణలోనికి తీసుకుంటారు. న్యాయపరమైన అంశాలను సానుకూల పరచుకోగలుగుతారు.

**తుల :** ఆశించిన ఋణాలు లభిస్తాయి. మిత్రులతోటి కలిసి కష్టసుఖాలు చెప్పుకుంటారు. ఒకింత పురోభివృద్ధిలో ఉంటాయి.

**వృశ్చికం:** మానసిక ప్రశాంతతకు గాను వినోద కార్యక్రమాలపైన దృష్టిని సారిస్తారు. నూతన గ్రంథపఠనం చేస్తారు.

**ధనుస్సు:** విహారయాత్రలు చేస్తారు. ఎలక్ట్రానిక్‌ వస్తువులను కొనుగోలు చేస్తారు. ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది.

**మకరం:** ఆశించిన ఋణాలు లభిస్తాయి. స్తంభించిన అమ్మకాలలో కదలిక ఏర్పడు తుంది.

**కుంభం:** బహుమతులను ఇచ్చిపుచ్చు కుంటారు. మధ్యవర్తి వ్యవహారాలు, రాయబారాలు, చర్చాగోష్ఠులను సాగిస్తారు.

**మీనం:** న్యాయపరమైన అంశాలను సానుకూల పరచుకోగలుగుతారు. దైవ దర్శనం చేసుకుంటారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# టిడ్కో కాలనీల్లో ఆలయాల నిర్మాణం

>> పెట్టుబడులను ఆకర్షించి పరిశ్రమల ఏర్పాటుతో స్థానికంగానే యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. పోలవరం, వెలుగొండ తదితర ప్రాజెక్టులను పూర్తిచేయడంతోపాటు ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

**5 వేల శ్రీవాణి ఆలయాల నిర్మాణం: మంత్రి ఆనం**

ఆత్మకూరు టిడ్కో గృహ సముదాయంలో రాష్ట్రంలోనే తొలిసారిగా రూ.75 లక్షలతో నిర్మించిన శ్రీకోదండరామస్వామి ఆలయాన్ని మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. మహాకుంభాభిషేకంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల శ్రీవాణి ఆలయాల నిర్మాణ లక్ష్యమన్నారు. ఇప్పటికే 2 వేల ఆలయాల పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. మరో వెయ్యి ఆలయాలకు ప్రణాళిక సిద్ధమవుతోందన్నారు. ఈ లక్ష్యంలో భాగంగా ఆత్మకూరు టిడ్కో కాలనీలో నిర్మించిన ఆలయం పూర్తయిందన్నారు.

ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధి ప్రస్థానంలో సోమవారం మరో కీలకముందడుగు పడింది. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సారధ్యంలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమఆల పండుగలో భాగంగా ఒకే రోజు 53.25కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరిగాయి. అదేవిధంగా ఆత్మకూరు పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి మరో మరో రూ.29కోట్ల పనులకు కూడా ముందడుగు పడింది. రాష్ట్ర మంత్రులు డాక్టర్‌ పొంగూరు నారాయణ, కొలుసు పార్థసారధి తోపాటు రాజ్యసభ సభ్యులు బీదమస్తాన్‌రావు, శాసనమండలి సభ్యులు బీదరవిచంద్ర, కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, నుడా ఛైర్మన్‌ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా కలెక్టర్‌ హిమాన్షు శుక్లా తదితరులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులకు ఘనస్వాగతం పలికారు. ఆత్మకూరు మున్సిపల్‌ కార్యాలయ ఆవరణలో రూ.45 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు పైలాన్‌ను మంత్రులు ఆవిష్కరించారు. పలు కీలక పనులకు శంకుస్థాపనలు చేసి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఎన్‌డిఎ కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్‌ ర్యాలీని మంత్రులు ప్రారంభించారు. భారీగా కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొనడంతో ర్యాలీ కోలాహలంగా సాగింది.

### 185కుటుంబాలకు 1.46కోట్లు సిఎంఆర్‌ఎఫ్‌

అభివృద్ధి కార్యక్రమాలతోపాటు సంక్షేమానికి కూడా ప్రాధాన్యం ఇస్తూ 185కుటుంబాలకు 1.46కోట్ల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమాంతరంగా ముందుకు తీసుకెళ్ళడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రులు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మంత్రులు,అధికారులు, ప్రజా ప్రతినిధులు, నియోజకవర్గ, స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గురజాడ సాహిత్య సేవలు చిరస్మరణీయం:కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** గురజాడ అప్పారావు తెలుగు సాహిత్యానికి, సమాజ సంస్కరణకు చేసిన సేవలు చిరస్మరణీయమని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌ చదలవాడ నాగరాణి అన్నారు. గురజాడ జయంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్‌ఎస్‌ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి కలెక్టర్‌, జాయింట్‌ కలెక్టర్‌ కె.ఆర్‌. కల్పశ్రీ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ ఆధునిక తెలుగు సాహిత్యానికి గురజాడ దిశానిర్దేశం చేశారని, తన రచనల ద్వారా మూఢనమ్మకాలు, సామాజిక అసమానతలు, అన్యాయాలను ప్రశ్నించి ప్రజల్లో చైతన్యం కలిగించారని తెలిపారు. "దేశమంటే మట్టి కాదోయ్‌.. దేశమంటే మనుషులోయ్‌" అనే సందేశం దేశభక్తి, మానవతా విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందించేలా ఉందన్నారు. వ్యవహారిక భాషకు ప్రాధాన్యత కల్పించి తెలుగు భాషను ప్రజలకు చేరువ చేయడంలో గురజాడ కృషి విశేషమన్నారు. యువత గురజాడ సాహిత్యాన్ని చదివి ఆయన ఆశయాలను తెలుసుకుని సమాజ అభివృద్ధిలో భాగస్వా ములు కావాలని కలెక్టర్‌ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తుఫాన్‌ ముప్పు





>>ప్రజలను అవసరమైతే వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలని స్పష్టం చేశారు. పొంగిపొర్లే వాగులు, ప్రమాదకరమైన కాజ్‌వేలు, ముంపు ప్రాంతాల వద్ద తప్పనిసరిగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని హోంమంత్రి ఆదేశించారు. ప్రాణనష్టం జరగకుండా వాహనాలు, ప్రజల రాకపోకలను కట్టడి చేయాలని సూచించారు. ఈ తీవ్రవాయుగుండం ప్రభావంతో తీరం వెంబడి గంటకు 50 నుండి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి సూచించారు. మత్స్యకారులు వేటకు వెళ్ళరాదని హెచ్చరించారు. చెట్లు, భారీ హోర్డింగ్స్‌, పాతబడిన/ శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండరాదని సూచించారు. ప్రజలందరూ ప్రభుత్వం జారీ చేసే అధికారిక సూచనలను పాటిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### అధికారుల అప్రమత్తం చేసిన మంత్రి అచ్చెన్నాయుడు

**శ్రీకాకుళం, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌ స్వప్నిల్‌ దినకర్‌ పుండ్కర్‌తో పాటు వివిధ శాఖల అధికారులతో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఫోన్‌లో మాట్లాడి తుఫాన్‌ పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలను ముమ్మరం చేయాలని అధికారులకు ఆదేశించారు. లోతట్టు, తీర ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైతే ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. తుఫాన్‌ పునరావాస కేంద్రాల్లో మంచినీరు, ఆహారం, విద్యుత్‌, వైద్యం, పారిశుద్ధ్యంతో పాటు అవసరమైన అన్ని మౌలిక వసతులు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా వాగులు, కాలువలు, నదులు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేసి ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తుఫాన్‌ ప్రభావం పూర్తిగా తగ్గే వరకు అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమ త్తంగా ఉండి ప్రజల భద్రతకు అత్యధికప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

# పిడుగు పాటుకు ఇద్దరు మహిళలు మృతి

**కర్నూలు, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం ఉప్పలపాడు గ్రామంలో సోమవారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. పొలంలో టమోటా పండ్లు కోస్తుండగా ఒక్కసారిగా పిడుగు పడటంతో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులను ఉప్పలపాడు గ్రామానికి చెందిన మహబూబ్‌ బీ (60), ముర్తు జాబి (62)గా గుర్తించారు. వీరిద్దరూ వదిన, మరదలుగా స్థానికులు తెలిపారు. రోజులాగే సోమవారం ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లిన మహిళలు టమోటా పంట కోస్తుండగా మధ్యాహ్నం సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం ప్రారంభమైన సమయంలో ఉన్నట్టుండి పిడుగు పడటంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఘటనా స్థలానికి పోలీసులు, రెవెన్యూ అధికారులు సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనపై విచారణ చేపట్టి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఉదయం ఇంటి నుంచి వ్యవసాయ పనులకు వెళ్లిన మహిళలు మృతదేహాలుగా తిరిగి రావడంతో వారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనతో ఉప్పలపాడు గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్ మూసివేత

### దుర్గమ్మ ఆలయానికి చేరుకోడానికి బస్సులు ఏర్పాటు

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** దసరా ఉత్సవాల సందర్భంగా భక్తులకు సరైన సౌకర్యాలు కల్పించేందుకు ఇంద్రకీలాద్రి ఘాట్‌ రోడ్‌ మరామత్తుపనులు చేపట్టే క్రమంలో సెప్టెంబర్‌ 22 ఉదయం నుండి వారం రోజుల పాటు ఘాట్‌ రోడ్‌ పూర్తిగా మూసివేస్తున్నట్లు ఇఓ వికె శీనా నాయక్‌ తెలిపారు. కాబట్టి వారం రోజులు శ్రీ కనకదుర్గానగర్‌ మార్గం నుండి భక్తులు దేవస్థానం నకు చేరుకోవాలన్నారు. హైదరాబాద్‌ నుండి వచ్చే భక్తులు పున్నమి ఘాట్లో తమ వాహనాలు పార్క్‌ చేసుకొని, అక్కడ నుండి దేవస్థానం ఏర్పాటు చేస్తున్న ఉచిత బస్‌ ద్వారా దేవస్థానమునకు చేరుకోవచ్చని, విశాఖపట్నం, చెన్నయ్‌ తదితర ప్రాంతాల నుండి వన్‌ టౌన్‌ వైపు వచ్చే భక్తులు సీతమ్మ వారి పాదాలు వద్ద ఉన్న హోల్డింగ్‌ ఏరియాలో తమ వాహనాలు పార్క్‌ చేసుకొని దేవస్థానం ఏర్పాటు చేసే ఉచిత బస్‌ ద్వారా దేవస్థానమునకు చేరుకోవాలని తెలిపారు. ఈ వారం రోజులు పార్కింగ్‌ ప్రదేశాలు నుండి దేవస్థానంనకు ఉచిత రవాణా సదుపాయం ఏర్పాటు చేసామని, భక్తులు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

## స్టైపెండ్ పెంపు

>> పెంచాలని జూనియర్‌ డాక్టర్ల అసోసియేషన్‌ (జూడా) కొంతకాలంగా ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేస్తూ ఆందోళనలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారి డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని స్టైఫండ్‌ పెంపునకు ఆమోదం తెలిపింది. పభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఎంబిబిఎస్‌, బిడిఎస్‌ హౌస్‌ సర్జన్లకు 10 శాతం స్టైఫండ్‌ పెంచారు. దీంతో వారి నెలవారీ స్టైఫండ్‌ రూ.28,497కి చేరింది. అదేవిధంగా, పిజి డిగ్రీ, డిప్లొమా కోర్సులు చేస్తున్న వైద్య విద్యార్థులకు 5శాతం, సూపర్‌ స్పెషాలిటీ కోర్సులు అభ్యసిస్తున్న వారికి 3.5శాతం చొప్పున స్టైఫండ్‌ను పెంచారు. ఈ పెంపు నిర్ణయం ఎంబిబిఎస్‌, బిడిఎస్‌, పిజి మెడిసిన్‌, సూపర్‌ స్పెషాలిటీ, ఎండిఎస్‌, డిఎన్‌బి విద్యార్థులందరికీ వర్తిస్తుంది. జూనియర్‌ డాక్టర్ల ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల వైద్య విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# డిఎస్సీలో స్పోర్ట్స్‌ కోటా రగడ

>> స్పోర్ట్స్‌ కోటా అవకతవకలపై ప్రత్యేక విచారణ చేయాలంటూ వైఎస్సార్సీపీ శాప్‌ ముట్టడి కార్యక్రమానికి పిలుపును ఇచ్చింది. ఈ ఆందోళనకు పోలీసులు అనుపతిని నిరాకరించారు. అయినప్పటికి వైఎస్సార్సీపీ కార్తకర్తలు నిరసన ప్రదర్శన బందరు రోడ్డు మీదుగా శాప్‌ కార్యాలయానికి బయలుదేరారు. దీంతో రహదారిపై ట్రాఫిక్‌ నిలిచిపోయింది. పోలీసులు నియంత్రిస్తున్న వారు ప్రదర్శనగా శాప్‌ కార్యాలయానికి చేరుకుని ముట్టడికి ప్రయత్నించారు. అప్పటికే అక్కడ ఉన్న పోలీసులు వారి అడ్డగించారు. ఈ క్రమంలో శాప్‌ కార్యాలయంలోపల ఉన్న స్పోర్ట్సు కోటా టీచర్లు గేటువద్దకు చేరారు. క్రీడలశాఖ మంత్రి రాంప్రసాద్‌ రెడ్డి, శాప్‌ ఛైర్మన్‌ రవినాయుడు, శాప్‌ ఎండీ భరణికి వినతిపత్రాలు అందజేసేందుకు శాప్‌ కార్యాలయం వద్దకు స్పోర్ట్స్‌ కోటా టీచర్లు వచ్చి ఆందోళనను గమనించి లోపల ఉండిపోయారు. దాంతో వైఎస్సార్సీపీ నేతలు వారిని చూసి బిగ్గరగా నినాదాలు చేసారు. టీచర్లు వారికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. ఈ పరిణామాల నేపథ్యంలో వైఎస్సార్సీపీ నేతలు కార్యాలయం బయట ధర్నాకు దిగారు. నిరసనకు పోలీసుల అనుమతి లేకపోయినా ఆ పార్టీ నాయకులు దేవినేని అవినాశ్‌, జోగి రమేశ్‌ నేతృత్వంలో పలు ప్రాంతాల నుంచి పెద్దఎత్తున వైఎస్సార్సీపీ శ్రేణులు, మద్దతుదారులు కార్యాలయాన్ని ముట్టడించారు. డీఎస్సీలో అక్రమాలకు పాల్పడ్డారంటూ ఆరోపించారు. దీంతో ఇటు టీచర్లు, అటు ఆ పార్టీ కార్యకర్తలు నినాదాలు చేశారు. వైఎస్సార్సీపీ నేతల ఆరోపణలను స్పోర్ట్స్‌ కోటా టీచర్లు తీవ్రంగా ఖండించారు. "తమ సర్టిఫికెట్లు, మెడల్లు నిజమైనవి. ఇకనైనా వాస్తవాలు తెలుసుకుని నిందలు మానుకోవాలి. ఆరోపణలు చేసే వారికి ఆధారాలు చూపిస్తాం" అని టీచర్లు నినాదాలు చేశారు. దీంతో మరింత రెచ్చిపోయిన వైఎస్సార్సీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. గేట్లు దూకి శాప్‌ కార్యాలయంలోకి ప్రవేశించేందుకు యత్నించారు. ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ నేతలు, ఉపాధ్యాయులపై వాటర్‌ బాటిళ్లు విసిరారు. ఉపాధ్యాయలపై దాడిని అడ్డుకునేందుకు వెళ్లిన టీడీపీ యువగళం టీమ్‌పై కూడా వారు విరుచుకుపడ్డారు. దీంతో తమకు గాయాలయ్యాయని బాధితులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాలకు చెందిన కొందరు బాహాబాహీకి దిగారు. వీరిని నిలువరించే క్రమంలో పోలీసులు, వైఎస్సార్సీపీ నేతల మధ్య తోపులాట జరిగింది. ఇలా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విజయవాడ ప్రధాన రహదారి బందరు రోడ్డుపై వైఎస్సార్సీపీ నాయకుల ఆందోళనతో ట్రాఫిక్‌ స్తంభించి పోయింది. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు, భద్రతా దళాలు రంగ ప్రవేశం చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. వైఎస్సార్సీపీ నాయకులను మద్దతుదారులను అక్కడ నుంచి తరలించడంతో పరిస్థితి సద్దుమణిగింది. అనంతరం టీచర్లు శాప్‌ ఎండీ భరణితో మాట్లాడి తమ సమస్యలను విన్నవించుకున్నారు.

**ఉపాధ్యాయులను అవమానించడం సరికాదు,వారిపై దౌర్జన్యం చేయడం దుర్మార్గం - మంత్రి మండిపల్లి:** శాప్‌ కార్యాలయం వద్ద వైఎస్సార్సీపీ నేతల అల్లర్లను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌ రెడ్డి తీవ్రంగా ఖండించారు. దేవినేని అవినాష్‌, జోగి రమేష్‌ రౌడీ గ్యాంగులతో శాప్‌ కార్యాలయం వద్ద రాళ్లు, కోడిగుడ్లతో అల్లర్లకు పాల్పడ్డారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాన్ని చుట్టుముట్టి ఉపాధ్యాయులపై దాడికి యత్నించడం హేయమైన చర్య అని మండిపడ్డారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం వైఎస్సార్సీపీ నేతల విజ్ఞతకే వదిలేస్తున్నామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు.

## దాడి దుర్మార్గం: మంత్రి లోకేష్‌

>> పార్టీని ఉద్దేశించి తీవ్ర ఆరోపణలు చేసారు. అత్యుత్తమ ఆటతీరుతో మన రాష్ట్రం, మన దేశం సత్తా ప్రపంచానికి చాటిన క్రీడాకారులను స్పోర్ట్స్‌ కోటాలో అవకతవకలు అంటూ ఫేక్‌ ఆరోపణలు చేసినప్పుడే జగన్‌ గారి దుర్బుద్ధి బయటపడింది. జగన్‌ ఫేక్‌ ముఠా తప్పుడు నిందలతో అవమానాలు పాలైన స్పోర్ట్స్‌ కోటా డీఎస్సీ 2025 టీచర్లు తమకు న్యాయం చేయాలంటూ శాప్‌ కార్యాలయం వద్ద అధికారులను కలిశారు. క్రీడలతో మన దేశ పతాకాన్ని రెపరెపలాడించి, ప్రతిభతో టీచర్‌ ఉద్యోగం సాధించిన స్పోర్ట్స్‌ కోటా టీచర్లపై వైసీపీ ఫ్యాక్షన్‌ ముఠా శాప్‌ కార్యాలయం వద్ద దాడికి దిగింది. రౌడీ షీటర్లు, గంజాయి బ్లేడ్‌ బ్యాచులను టీచర్లపైకి ఉసిగొల్పడం జగన్‌ నేర మనస్తత్వాన్ని బయటపెట్టింది. పూజించాల్సిన గురువులపై రాడ్లు, కర్రలతో దాడి చేసిన జగన్‌ క్రిమినల్‌ గ్యాంగులను వదిలే ప్రసక్తి లేదు. టీచర్లపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ స్కూళ్లు, టీచర్ల జోలికి వైసీపీ రావడం మానుకోవాలి. వైసీపీ ప్రేరేపిత రౌడీ షీటర్లు, గంజాయి బ్లేడ్‌ బ్యాచుల పనిపడతాం.

## మాజీ మావోయిస్టుల రాజకీయ పార్టీ

**హైదరాబాద్,సెప్టెంబరు21,ప్రభాతవార్త:** దాదాపు ఐదు దశాబ్దాలుగా విప్లవోద్యమాల్లో చురుగ్గా పనిచేసి,తదనంతరం సామాన్య జీవితంలోకి అడుగుపెట్టిన మాజీ మావోయిస్టులే ప్రధాన చోదకశక్తిగా జన తెలంగాణ పార్టీ రూపుదిద్దుకుంటోంది. లంకా పాపిరెడ్డి (లచ్చన్న), అడ్వొకేట్‌ బల్ల రవీంద్రనాథ్‌, గురిజాల రవీందర్‌రావు, ఆదిలాబాద్‌ జిల్లాకు చెందిన అజయ్‌ బాల్నె, కరీంనగర్‌ జిల్లాకు చెందిన సదానందంలతో పాటు కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ పార్టీలకు చెందిన అభ్యుదయవాదులు, పౌరహక్కుల ఉద్యమకారులు ఇందులో కీలక పాత్ర పోషించనున్నారు.

## తణుకు పట్టణాభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా కృషి: ఎమ్మెల్యే రాధాకృష్ణ

**తణుకు, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** తణుకు పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు గతంలో ఎన్నడూ లేనివిధంగా నిధులు తీసుకువచ్చి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే రాధాకృష్ణ తెలి పారు. నియోజకవర్గ ప్రజెంట్‌ యాక్షన్‌ ప్లాన్‌-2047లో భాగంగా తణుకు పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్‌కు అనుగుణంగా ప్రజలకు మెరుగైన మోలిక సదుపాయాలు కల్పించేందుకు చేపట్టిన పనులను నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి చేసేలా పర్యవేక్షి స్తున్నట్లు చెప్పారు. మున్సిపల్‌ శాఖ మంత్రి నారాయణ ప్రత్యేక దృష్టి సారించి తణుకు మున్సిపాలిటీకి పెద్దఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. పట్టణంలో వంద శాతం డ్రైనేజీ నిర్మాణాలు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు.

## దళితుల ఆలయ ప్రవేశానికి వందేళ్లు

>>సబ్‌ డివిజనల్‌ మేజిస్ట్రేట్‌ ఎదుట వాదనలు వినిపించారని చెప్పారు. అనంతరం మహాత్మా గాంధీ తిరుపతికి వచ్చి సత్యాగ్రహం చేపట్టడంతో 33 మంది దళితులకు తిరుచానూరు ఆలయ ప్రవేశం లభించిందని పేర్కొన్నారు. ఈ చారిత్రక ఘటనకు వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా అక్టోబర్‌ 11, 12, 13 తేదీల్లో తిరుపతిలో శతాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశంలోని ప్రముఖ నాయకులు, న్యాయమూర్తులు, తెలంగాణకు చెందిన నాయకులను ఆహ్వానించనున్నట్లు చెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్‌ 46 స్ఫూర్తికి అనుగుణంగా ఎస్సీ, ఎస్టీల ఆర్థిక, విద్యాభివృద్ధికి మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ, ఎస్టీ ఫైనాన్స్‌ కార్పొరేషన్లు చాలా కాలంగా పనిచేయడం లేదని ఆరోపిస్తూ వాటిని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్‌ చేశారు. వరుస ప్రభుత్వాలు కార్పొరేషన్లను పునరుద్ధరించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. ఇదే సమయంలో దేశంలో, రెండు తెలుగు రాష్ట్రాల్లో పత్రికా స్వేచ్ఛ క్షీ ణిస్తోందని చింతా మోహన్‌ ఆందోళన వ్యక్తం చేశారు. మీడియాపై వివిధ రకాల ఆంక్షలు, కార్పొరేట్‌ సంస్థల ప్రభావం పెరగడంతో జర్నలిస్టులు స్వేచ్ఛగా పనిచేసే పరిస్థితులు తగ్గుతున్నాయని ఆరోపించారు. గతంతో పోలిస్తే ప్రభుత్వాలు, రాజకీయ నాయకులపై విమర్శనాత్మకంగా రాసే స్వేచ్ఛ తగ్గిందన్నారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆర్థిక అసమానతలు వంటి సమస్యలపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని కోరారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే మీడియాకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలని డిమాండ్‌ చేశారు.

## ఏలూరు పిజిఆర్‌ఎస్‌కు 457 అర్జీలు: కలెక్టర్ కె.వెట్రిసెల్వి

**ఏలూరు, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్‌ఎస్‌) కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్‌ కె.వెట్రిసెల్వి ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ డా.యం.జె.అభిషేక్‌ గౌడ, అసిస్టెంట్‌ కలెక్టర్‌ సి.హెచ్‌.శ్రావణ్‌కుమార్‌రెడ్డి తదితర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు మొత్తం 457 అర్జీలను అధికారులకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్‌, రెవెన్యూ క్లినిక్‌లలో అందిన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా విచారణ జరిపి అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని సూచించారు. నిర్ణీత గడువులో సమస్యలను పరిష్కరించకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్జీల్లో భాగంగా కైకలూరుకు చెందిన మండే దేవమణి కుటుంబ భూవివాదంపై రీసర్వే చేసి హద్దులు నిర్ణయించాలని కోరారు. జంగారెడ్డిగూడెంకు చెందిన కలపాల కృష్ణమూర్తి తన 1.75 సెంట్ల భూమి ఆక్రమణకు గురైందని, విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. చింతలపూడి మండలం యడవల్లికి చెందిన షేక్‌ మీరాబి కట్నం కోసం భర్త, అత్తమామలు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఫిర్యాదు చేశారు. పోలవరం మండలం జగన్నాథపేటకు చెందిన ఎస్‌.కె.సైదాని డ్వాక్రా సంఘంలో ఒక సభ్యురాలు రుణ బకాయిలు చెల్లించకపోవడంతో మిగతా సభ్యులకు రుణాలు మంజూరు కావడం లేదని, సమస్యను పరిష్కరించాలని కోరారు. జీలుగుమిల్లి మండలం దర్భగూడెంకు చెందిన సూరారెడ్డి శిలపరెడ్డి తన భూమిని రీసర్వే చేసి హద్దులు నిర్ణయించాలని అర్జీ సమర్పించారు.



## ఒపి సేవల్లో హెచ్‌ఒడిలు గైర్హాజరు

### అనంతపురం ఎమ్మెల్యే ప్రసాద్ ఆగ్రహం..

**అనంతపురం క్రైమ్‌ సెప్టెంబర్‌ 21 ప్రభాతవార్త:** అనంతపురం జిల్లా సర్వజనాస్పత్రిని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం ఆసుపత్రికి వెళ్లి అన్ని విభాగాల వార్డులను సందర్శించారు. అక్కడ రోగులతో మాట్లాడి వైద్య సేవలు గురించి ఆరా తీశారు. అలాగే అన్ని ఓపి విభాగాలను కూడా ఆయన పరిశీలించారు. అక్కడ క్యూలైన్లలో ఉన్న ప్రజలతో మాట్లాడారు. అయితే ఓపి సేవలో హెచ్వోడీలు లేకపోవడంపై ఎమ్మెల్యే దగ్గు పాటి ప్రసాద్‌ ఆగ్రహం, అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో మొత్తం 560 పడకల మాత్రమే ఉన్నాయన్నారు. కానీ ఇక్కడ ఇన్‌ పేషెంట్లు 1,200 మందికి పైగా ఉన్నారన్నారు. ప్రతిరోజు 2,000 నుంచి 2,300 వరకు ఔట్‌ పేషెంట్లు ఇక్కడ వైద్య సేవలు పొందుతున్నారన్నారు. సోమవారం రోజు 3వేల మంది వరకు ఇక్కడికి వస్తున్నారన్నారు.

**EASTERN POWER DISTRIBUTION COMPANY OF A.P. LTD**
**OPERATION CIRCLE : PARVATHIPURAM MANYAM**

**e-Tender Notice No.SE/O/PMY/PUR/01/2026-27**

e-Tenders are invited from valid Class-I Contractors in APEPDCL for the work of "Execution of line works for extension of supply to 2 No's Cat-II services of each load 73KW in favor of RELIANCE BP MOBILITY LIMITED at Kesali Village in Pachipenta Mandal of Parvathipuram District" vide Tender Specification Nos: 01/2026-27. For downloading detailed 1 No. Tender Notices explore website **www.apeprocurement.gov.in** or contact office of the Superintending Engineer, Operation, Parvathipuram Manyam. Last date & Time for receipt of Tenders through online is **29.09.2026 at 13:00 Hrs.**

Ph : 9440907289 Advt-53 **Superintending Engineer**

22-9Pg3exHMNWJQE.qxdo/p:22-9Pg3exHMNWJQE.qxd 1/1/02 6:47 AM Page 1

సాహిత్యం - గతి నిరంతరం మాన్యువల్
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
శ్రీకాకుళం
: fb.com/vaartha Digital
Published from Srikakulam ,Visakhapatnam, Vijayawada, Hyderabad,Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem
22-9-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 233 పేజీలు: 16 వెల: 6.50

పచ్చని వనంలో ఆధ్యాత్మిక పరిమళం
16 యేళ్ల నిరీక్షణకు తెర
పొట్టిలంకలో డబుల్ లేన్ వంతెన
5లో

# ధైర్యముంటే అసెంబ్లీకి రండి


సోమవారం కుప్పం బహిరంగ సభలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబునాయుడు, సభకు హాజరైన జనసందోహం

**సాక్ష్యాలతో మీ బట్టలూడదీస్తాం..**
**పిచ్చిపిచ్చ ఆటలు ఆడొద్దు**
**కుప్పం బహిరంగసభలో సిఎం చంద్రబాబు హెచ్చరిక**
**నేరాల్ని, మతమార్పిడుల్ని ప్రోత్సహించే పార్టీ వైసిపి అని మండిపాటు**
**స్థానిక ఎన్నికల్లో ప్రజలు ఏకపక్షంగా ఓట్లేయాలని పిలుపు**
**పలు అభివృద్ధి పనులు ప్రారంభోత్సవం, మరికొన్నింటికి శంకుస్థాపన**

**కుప్పం, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** మెగా డిఎస్సిలో అక్రమాలు జరిగాయంటున్న వారు ధైర్యం ఉంటే అసెంబ్లీకి రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సవాల్ విసిరారు. తమ వద్ద ఉన్న సాక్ష్యాలతో వారి బట్టలూడదీస్తామని పేర్కొన్నారు. రెండు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా సిఎం చంద్రబాబు కుప్పం కొత్తపేటలో నిర్వహించిన బహిరంగసభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. తాజాగా విజయవాడలో గొడ్డలి పార్టీ రౌడీలు గురువులపై దాడి చేయడం దారుణమన్నారు. ఇది బరితెగింపు కాదా అని ప్రశ్నించారు. వైఎస్సార్సీ నేతలకు డిఎస్సిపై సాక్ష్యాలుంటే కోర్టుకు వెళ్లాలని, పిచ్చపిచ్చ ఆటలు ఆడొద్దని హెచ్చరించారు. ఇప్పటికే 355పిటీషన్లు వేశారన్నారు. వైఎస్సార్సీ హయాంలో జరిగిన ఎపిపిఎస్సి పరీక్షలపై సమాధానం చెప్పరని పేర్కొన్నారు. మీరు ఫేక్ అంటే అందరూ ఫేకేనా అని ప్రశ్నించారు. గొడ్డలిపార్టీ నాయకులకు పూనకాలు వస్తుంటాయని, అవి తన దగ్గర పనిచేయవని సిఎం పేర్కొన్నారు. తాను 14 డిఎస్సిలు నిర్వహించానని డిఎస్సి అంటే సిబిఎన్ అని పేర్కొన్నారు. తాను పట్టు వదలని విక్రమార్కుడిలా ముందుకు సాగుతానని చంద్రబాబు స్పష్టం చేశారు. తాను తప్పుచేయనని చేయని తప్పుకు 53రోజులు జైల్లో పెట్టారన్నారు. తమ పాలనలో అవినీతి జరిగే సమస్యే లేదని పేపర్ల లీకులు ఉండవని అలా జరిగితే తప్పుచేసిన వారికి అదే చివరి రోజు అని పేర్కొన్నారు. డిఎస్సి ఉపాధ్యాయులు ఇప్పటికే కర్నూలు కొండారెడ్డి బురుజు, విజయవాడ, వైజాగ్‌లో సింహగర్జన చేశారన్నారు. తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ చేసిన వారిని శ్రీవారే శిక్షిస్తున్నారని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**వారికి ఓట్లు అడిగే హక్కు లేదు:** నేరాలు, మతమార్పిడులను ప్రోత్సహించే వైఎస్సార్సీకి ఓట్లు అడిగే హక్కు లేదని సిఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. రాజకీయాల ముసుగులో నేరస్తులు వద్దని ఇందుకు ప్రజలు సిద్ధమా అని ప్రశ్నించారు. ఎన్డీయే సుస్థిరతకు మారుపేరు, అభివృద్ధికి చిరునామా అని పేర్కొన్నారు. తాను, పవన్ కల్యాణ్, బిజెపి కలసి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తామన్నారు. ఒక్కవార్డు కూడా వైఎస్సార్సీ గెలవరాదని, ప్రజలే ఏకపక్షంగా కూటమికి ఓట్లేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అభివృద్ధికి చోటు ఉంటుందే తప్ప రౌడీయిజానికి చోటులేదని స్పష్టంచేశారు. ప్రజల ఆస్తులు, పిల్లలు, మహిళలకు తాము రక్షణగా ఉంటామన్నారు.

**దేశానికి నమూనాగా ప్రకృతి వ్యవసాయం:** రాష్ట్రంలో చేపడుతున్న ప్రకృతి వ్యవసాయం దేశానికి నమూనాగా మారిందని సిఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా 20లక్షల ఎకరాల్లో రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు చేపట్టారన్నారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో ఆల్మట్టి, తుంగభద్ర డ్యామ్‌లతో సహా రాష్ట్రంలోని అన్ని >>2



## జూనియర్ డాక్టర్ల స్టైపెండ్ పెంపు

**హౌస్ సర్జన్లకు కూడా అమలు**
**ఎంబిబిఎస్, బిడిఎస్ ఇంటర్న్‌లకు 10% పెరుగుదల**
**పిజి విద్యార్థులకు 5%, సూపర్ స్పెషాలిటీ వారికి 3.5% పెంపు**
**రాష్ట్ర ఖజానాపై యేటా రూ.34.08 కోట్ల అదనపు ఆర్థిక భారం**
**2026 జనవరి 1 నుంచే పెంపు వర్తింపు**

**విజయవాడ, సెప్టెంబరు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారి స్టైఫండ్‌ను పెంచుతూ సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన స్టైఫండ్ 2026 జనవరి 1వ తేదీ నుంచి వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.34.08 కోట్ల అదనపు భారం పడనుంది. వివరాల్లోకి వెళితే, తమ పని భారానికి తగినట్లుగా స్టైఫండ్ >>2



**తిరుమల లడ్డూ పవిత్రత కోసం బిజెపి రాజీలేని పోరాటం**
**కమలం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్**
5

## తుఫాన్ ముప్పు



**బంగాళాఖాతంలో అల్పపీడనం**
**మూడు రోజులు భారీ వర్షసూచన**
**అప్రమత్తంగా ఉండాలని అధికారులకు హోం మంత్రి అనిత ఆదేశాలు**
**శ్రీకాకుళం జిల్లా అధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు ఫోన్ కాన్ఫరెన్స్**
**కర్నూలు జిల్లాలో పిడుగు పడి ఇద్దరు మృతి**

**అమరావతి, సెప్టెంబరు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రాబోయే రెండు రోజుల్లో తీవ్రవాయుగుండంగా బలపడి దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర తీరాల వైపు పయనించే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఉన్నత స్థాయి అత్యవసర సమీక్ష నిర్వహించారు. ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి ప్రఖర్ జైన్, ఇతర ఉన్నతాధికారులతో అత్యవసర టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన ముందస్తు భద్రతా చర్యలపై దిశానిర్దేశం చేశారు. తీవ్రవాయుగుండంప్రభావంతో బుధ, గురువారాల్లో ఉత్తరాంధ్రలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హోంమంత్రి తెలిపారు. ఒడిశాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వంశధార, నాగావళి నదుల ప్రవాహాలపై ప్రత్యేక దృష్టి సారించాలని హోం మంత్రి సూచించారు. ఒడిశా సరిహద్దు జిల్లాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేయాలని ఆదేశించారు. అత్యవసర సహాయక చర్యల కోసం ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలన్నారు. రాష్ట్ర,జిల్లా స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లను 24 గంటలూ అందుబాటులో ఉంచి, క్షేత్రస్థాయి అధికారులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా నిత్యావసరాలు, వైద్యం, ఇతర అత్యవసర సదుపాయాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తీరప్రాంత, లోతట్టు ప్రాంతాల్లోని >>2


సోమవారం ఆత్మకూరులో పలు అభివృద్ధికార్యక్రమాలలో పాల్గొన్న మంత్రులు ఆనం, నారాయణ, పార్థసారథి

## టిడ్కో కాలనీల్లో ఆలయాల నిర్మాణం

**మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ**
**యువతకు ఉద్యోగాలు, పరిశ్రమలపై దృష్టి: మంత్రి పార్థసారథి**
**5 వేల శ్రీవాణి ఆలయాల నిర్మాణం: మంత్రి రామనారాయణరెడ్డి**
**ఆత్మకూరులో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం**

**ఆత్మకూరు (నెల్లూరు), సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** సోమవారం ఆత్మకూరులో జరిగిన అభివృద్ధి జాతరలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో ఇళ్ళ నిర్మాణానికి గతంలో చేపట్టిన చర్యలను వివరిస్తూ టిడ్కో ఇళ్ళ నిర్మాణం జరుగుతున్న 163 ప్రాంగణాల్లో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక చొరవతో ఆలయాల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. టిడ్కో ఇళ్ళ పనులను పూర్తిచేసి లబ్ధిదారులకు గృహ ప్రవేశాలు చేయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఆత్మకూరు మున్సిపాల్టీ అభివృద్ధికి రూ.29 కోట్ల నిధులు మంజూరయ్యాయని, అమృత్ 2.0 కింద పనులు చేపట్టి ప్రతి ఇంటికి మంచినీటి కొళాయి కనెక్షన్ ద్వారా నదీజలాలు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నారాయణ తెలిపారు.

**యువతకు ఉద్యోగాలు, పరిశ్రమలపై దృష్టి: మంత్రి పార్థసారథి** రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలతోపాటు యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. రాబోయే ఐదేళ్ళలో 20లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాష్ట్రానికి >>2

## అక్టోబర్ 12 నుంచి పాఠశాలలకు దసరా సెలవులు

**విజయవాడ, సెప్టెంబరు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని పాఠశాల విద్యార్థులకు ఈ ఏడాది దసరా సెలవులు కాస్త ముందుగానే రానున్నాయి. అధికారికంగా ప్రకటించిన సెలవులకు ముందు రెండో శనివారం, ఆదివారం రావడంతో విద్యార్థులకు మరో రెండు రోజులు అదనంగా కలిసొచ్చాయి. దీంతో పండగ వాతావరణం ముందుగానే ఆరంభకానున్నది. రాష్ట్ర విద్యాశాఖ అకడమిక్ క్యాలెండర్ ప్రకారం, 2026 సంవత్సరానికి గాను అక్టోబర్ 12 నుంచి 21వ తేదీ వరకు, మొత్తం 10 రోజుల పాటు దసరా సెలవులను అధికారికంగా ప్రకటించారు. అయితే, దీనికి ముందుగా అక్టోబర్ 10వ తేదీ రెండో శనివారం, 11వ తేదీ ఆదివారం కావడంతో ఆ రెండు రోజులు కూడా సెలవుల్లో కలిసిపోయాయి. ఫలితంగా విద్యార్థులకు అక్టోబర్ 10 నుంచే సెలవులు ప్రారంభం కానున్నాయి. మొత్తం మీద 12 రోజుల పాటు విరామం లభించనుంది. సెలవుల అనంతరం అక్టోబర్ 22వ తేదీన పాఠశాలలు తిరిగి తెరుచుకుంటాయి.

**పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు**

## అభివృద్ధి చేసింది మేమే

**ఎక్కడైనా ప్రజల ముందు సమాధానం చెబుతాం**
**త్వరలో మూలపేట పోర్టును పూర్తి చేస్తాం**
**పలాస ఎయిర్‌పోర్టు కార్యరూపం దాల్చుతుంది**
**ఆముదాలవలసలో కేంద్ర మంత్రి రామ్మోహన్**

**సరుబుజ్జిలి (శ్రీకాకుళం జిల్లా), సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** పంచాయతీ స్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి వరకు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. అభివృద్ధిపై ఎక్కడైనా ప్రజల ముందు సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. సోమవారం శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస నియోజకవర్గ పరిధిలోని అలికాం-బత్తిలి, జగన్నాధపురం-సరుబుజ్జిలి మధ్య రూ.13.46 కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించిన బీటీ రోడ్డును స్థానిక ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌లతో కలిసి కేంద్ర మంత్రి ప్రారంభించారు. అనంతరం కూడలిలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ. 'కనెక్టివిటీతోనే అభివృద్ధి' అనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రహదారులు, మౌలిక వసతులను పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తోందన్నారు. సరుబుజ్జిలి రహదారి విమానాలు దిగే రన్‌వేలా అద్భుతంగా సిద్ధమైందని పేర్కొన్నారు. స్పష్టమైన కార్యాచరణతో సరుబుజ్జిలి మండలాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్‌తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్‌ను స్థానికంగా అమలు చేస్తామని తెలిపారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చిన ఘనత టిడిపి- జనసేన- బిజెపి కూటమి ప్రభుత్వానిదేనని అన్నారు. గత 25 యేళ్లలో కేవలం ఏడు సంవత్సరాలు మాత్రమే టిడిపి అధికారంలో ఉందని గుర్తు చేశారు. ఎవరు ఎంతకాలం అధికారంలో ఉన్నారు.. ఎవరు మంత్రులుగా పని చేశారు అన్నది ప్రజలకు తెలుసన్నారు. ప్రెస్‌మీట్లలో హడావుడి చేసే నేతలు ప్రజల ముందుకు వచ్చి వాస్తవాలు మాట్లాడాలని రామ్మోహన్ నాయుడు అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మౌలిక వసతులు, తాగునీరు, సాగునీటి >>2


ఆముదాలవలస నియోజకవర్గ పరిధిలోని బిటి రోడ్డు ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

# డిఎస్సీలో స్పోర్ట్స్ కోటా రగడ


సోమవారం శాప్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న వైసిపి నేతలు

**విజయవాడలో వైసిపి నిరసన ప్రదర్శన**
**'శాప్' కార్యాలయం ముట్టడికి యత్నం**
**అడ్డుకున్న పోలీసులు..నేతల బైఠాయింపు**
**అటు స్పోర్ట్స్ కోటా టీచర్ల ఆందోళన**
**వైసిపి శ్రేణులు, టీచర్ల మధ్య ఘర్షణ**
**నిరసనకారులపై పోలీసుల లాఠీచార్జ్**

**విజయవాడ,సెప్టెంబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలోని ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) కార్యాలయం వద్ద సోమవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. మెగా డీఎస్సీ 2025 >>2

## టీచర్లపై వైసిపి దాడి దుర్మార్గం: మంత్రి లోకేష్

**దుండగులను వదిలిపెట్టేది లేదని హెచ్చరిక**



**విజయవాడ,సెప్టెంబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** అందరూ దైవంలా భావించే గురువులను వైన్ షాపులకు కాపలా పెట్టిన జగన్ ఉపాధ్యాయులను గౌరవిస్తారు అనుకోవడం మనం భ్రమ అని ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. ఇది మీ సంస్కారమా అంటూ 'ఎక్స్' వేదికగా ఆయన వైసిపి నేతను, ఆయన >>2



## దళితుల ఆలయ ప్రవేశానికి వందేళ్లు

**అక్టోబరు 11 నుంచి మూడు రోజులు తిరుపతిలో శతాబ్ది వేడుకలు**
**ఎస్సీ,ఎస్టీ ఫైనాన్స్ కార్పొరేషన్లను పునరుద్ధరించాలి: మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్**

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** శతాబ్దం క్రితం తిరుచానూరు ఆలయంలో దళితుల ప్రవేశం కోసం జరిగిన పోరాటం నుంచి నేటి వరకు సామాజిక, ఆర్థిక హక్కుల కోసం పోరాటం కొనసాగుతూనే ఉందని మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చింతా మోహన్ అన్నారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పలు అంశాలను ప్రస్తావించారు. 1925 అక్టోబర్ 13న తిరుచానూరు ఆలయంలోకి ఓ దళితుడు ప్రవేశించి కర్పూర హారతి ఇవ్వడంతో ఆయనపై ఐపీసీ సెక్షన్ 295 కింద కేసు నమోదు చేసినట్లు చింతామోహన్ తెలిపారు. ఈ కేసులో చక్రవర్తుల రాజగోపాలాచారి(రాజాజీ) అప్పటి >>2

22-9Pg7exHMNWJQE.qxd:22-9Pg7exHMNWJQE.qxd 1/1/02 6:35 AM Page 1



## ఉమ్మడి అనంతపురంలో 59 కరువు మండలాలు..!

- అనంతపురం జిల్లాలో 29, శ్రీ సత్యసాయి జిల్లాలో 30 మండలాలు ఎంపిక
- కరువు మండలాల జాబితా నుండి పెద్దపప్పూరు, పెద్దవడుగూరు, రోళ్ల, అగలి అవుట్
- వర్షపాతం, ఖరీఫ్‌లో సాగైన పంటల విస్తీర్ణాన్ని బట్టి ఎంపిక చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- క్షేత్రస్థాయిలో పర్యటించి 6 అంశాలపై విచారణ నివేదికలు అందజేయాలని ఆదేశం

**ఉరవకొండ, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభా వంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని అరకొరగా సాగైన పం టలు సైతం ఎండిపోయి పశువులకు గ్రా సం కూడా లభించని తీవ్ర దుర్భిక్ష పరిస్థి తులు ఏర్పడిన నేపథ్యంలో రైతులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అడుగు లు వేస్తోంది. ఇందులో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 63 మండలా లకుగాను 59 మండలాలను కరువు మండ లాలుగా గుర్తించింది. అనంతపురం జిల్లా లో 31 మండలాలకు గాను పెద్దపప్పూరు, పెద్దవడుగూరు మండలాలు మినహా 29 మండలాలను, శ్రీ సత్యసాయి జిల్లాలో 32 మండలాలకుగాను రోళ్ల, అగలి మండలాలు మినహా 30 మండలాలను కరువు మండలాలుగా నిర్ధారించిందని సమాచారం. ఆయా మండలాల్లో ఈ ఏడాది కురవాల్సిన వర్షపాతం, ఇప్పటి వరకు నమోదైన వర్షపాతం, ఖరీఫ్ పంట కాలంలో ఆగస్టు 31 వరకు సాధారణ పంట విస్తీర్ణం, సాగైన పంటల సాగు విస్తీర్ణాన్ని పరిగణలోకి తీసుకొని కరువు మండలాలను ఎంపిక చేసినట్లు తెలు స్తోంది. కరువు మండలాలుగా గుర్తించిన మండలాల్లో వ్యవసాయాధికారు లు, సిబ్బంది పర్యటించి ఒక్కో మండలంలోని ఏవైనా 3 గ్రామాల్లో ప్రతి పంటకు 5 సర్వే నంబర్లు ఎంపిక చేసుకొని జియో ట్యాగింగ్‌తో పంటల ఫోటోలు తీసి గత 5 సంవత్సరాల్లో సాధారణ దిగుబడితో ఈ ఏడాది పంట దిగుబడిని అంచనావేసి సాధారణానికి, అంచనాకు మధ్య తేడాలతో రెండు మూడు రోజుల్లో సమగ్ర నివేదికలు పంపాలని ఆదేశించింది.

**అనంతపురం జిల్లాలో కరువు మండలాలు:**
అనంతపురం జిల్లాలో31 మండలాలు ఉం డగా 29 మండలాలను ప్రభుత్వం కరు వు మండలాలుగా గుర్తించింది. ఇందులో డి. హీరేహాళ్, కణేకల్లు, బొమ్మనహాళ్, విడప నకల్లు, గుంతకల్లు, గుత్తి, యాడికి, తాడిపత్రి, పామిడి, వజ్రకరూరు, ఉరవకొండ, బెలుగుప్ప, గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం, ఆత్మ కూరు, కూడేరు, గార్లదిన్నె, శింగనమల, పుట్లూరు, యల్ల నూరు, నార్పల, బుక్కరా యసముద్రం, అనంతపురం రూరల్, రాప్తాడు, శెట్టూరు, కుందుర్పి, కంబదూరు, అనంతపురం అర్బన్ మండలాలు ఉన్నాయి.

**శ్రీ సత్యసాయి జిల్లాలో కరువు మండలాలు:**
శ్రీ సత్యసాయి జిల్లాలో 32 మండలాలు ఉండగా అందులో 30 మండలాలు కరువు మండలాలుగా ప్రభుత్వం గుర్తించింది. ఇందులో కనగానిపల్లి, ధర్మ వరం, బత్తల పల్లి, తాడిమర్రి, ముదిగు బ్బ, తలుపుల, నంబులపూలకుంట, గాండ్లపెంట, కదిరి, నల్లమడ, బుక్కపట్నం, కొత్తచెరు వు, చెన్నే కొత్తపల్లి, రామగిరి, రొద్దం, మడకశిర, అమరాపురం, గుడిబండ, పరిగి, పెను కొండ, పుట్ట పర్తి, ఓబుల దేవరచెరువు, నల్ల చెరువు, తనకల్లు, అమడగూరు, గోరంట్ల, సోమందేపల్లి, హిందూ పురం, లేపాక్షి, చిలమత్తూరు మండలాలు ఉన్నాయి.

## ఇడి కస్టడీకి కారుమూరి... చంచల్‌గూడ జైలు నుంచి తరలింపు

**విజయవాడ, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** ఏపి లిక్కర్ స్కామ్‌లో నిందితుడుగా వున్న ఆ రాష్ట్ర మాజీ మంత్రి, వైకాపా నాయకుడు కారుమూరి నాగేశ్వరరావును కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు రెండు రోజుల కస్టడీ నిమిత్తం సోమ వారం అదుపులోకి తీసుకున్నారు. మొద టు ఉస్మానియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన తరువాత బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి తరలించారు. నె ల రోజుల క్రితం కారుమూరి హైదరాబాద్‌లో అరెస్టవడం తెలిసిందే. ఆయన ప్రస్తుతం చంచల్‌గూడ జైల్లో రిమాండు ఖైదీగా వున్నారు. ఏపి లి క్కర్ స్కాంలో ఆ రాష్ట్ర ఖజానాకు వాటిల్లిన 195.33 కోట్ల రూపాయల నష్టం గురించి ఆరా తీసేందుకు వారిని ఈడీ అధికారులు రెండు రోజుల పాటు విచారించనున్నారు. మంగళవారం సాయంత్రం వరకు ఆయనను విచారించిన తరువాత ఈడీ అధికారులు తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించనున్నారు. ఈ కేసులో కారుమూరి కుమారుడు సునీల్ రెడ్డితో పాటు మరికొందరిని కూడా ఈడీ అరెస్టు చేయడం తెలిసిందే. ఈ కేసును ఒకవైపు ఏపి పోలీసులు విచారిస్తుండగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ వేరుగా విచారిస్తోంది.

## అక్టోబర్ 10 నుంచి దసరా మహోత్సవాలు

- సమీక్షా సమావేశంలో దేవాదాయ శాఖ కార్యదర్శి కె.కన్నబాబు

**విజయవాడ, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** అక్టోబర్ 10 నుంచి 20వ తేదీ వరకు జరుగనున్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థాన శ్రీ వరాహ వనామ సంవత్సర దసరా మహోత్సవాలను గతంలో కంటే ఘనంగా, భక్తుల కు మరింత సౌకర్యవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయ తో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాదాయ శాఖ కార్యదర్శి కె.కన్నబాబు తెలిపా రు. ఏఐ సాంకేతికను అనుసంధానం చేసి భక్తుల భద్రతకు మరింత భరోసా కల్పించనుందని పాటు, ఆధ్యాత్మిక వాతావరణంలో అమ్మవారి దర్శనం త్వరగా, సౌకర్యవంతంగా లభించేలా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ఏపీఎస్ ఆర్ హాల్‌లో నిర్వహించిన సోమవారం సమీక్షా సమావేశంలో దేవాదాయ శాఖ కార్యదర్శి కె.కన్నబాబు, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సిపి ఎస్వీ రాజశేఖరబాబు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్, దుర్గగుడి ఇఒ వి.కె.శీనానాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.కన్నబాబు మాట్లాడుతూ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లు, దర్శన మార్గాలు, తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య సేవలు, పారిశుద్ధ్యం, రవాణా తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఉచిత దర్శనాల విషయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయడంతో పాటు, భక్తులకు ప్రసాదాల పం పిణీకి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. భక్తుల భద్రత, సౌకర్యాల విషయంలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా నిరంతరం పర్యవేక్షిoచాలని అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 16 మూలానక్షత్రం రోజున సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి ఆలయానికి రానున్న నేపథ్యంలో చేయాల్సిన ఏర్పాట్లపైనా సమావేశంలో చర్చించారు.

## గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా సిఎం నివాళులు

**విజయవాడ,సెప్టెంబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు ఘన నివాళులు అర్పించారు. సాహిత్యాన్ని సామాజిక సంస్కరణకు ఒక సాధనంగా మలచిన గొప్ప కవి గురజాడ, ఆయన సామాజిక దురాచారాలను ప్రశ్నించారు. సమాజం ఆలోచించేలా ప్రేరేపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి, మేము గురజాడ నివాసాన్ని పునరుద్ధరించాం. గురజాడ సాహిత్య వారసత్వాన్ని భావి తరాలకు అందించడమే మా సంకల్పం. త్వరలోనే గురజాడ రచనలు, సాహిత్య సంపదను డిజిటలీకరిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు.ఆయన సాహిత్యాన్ని ప్రజలకు పూర్తిస్థాయి అందుబాటులోకి తీసుకుని వస్తామన్నారు.

## భూములిచ్చేందుకు ముందుకు వస్తున్న రాజధాని ప్రాంత రైతులు

**విజయవాడ.సెప్టెంబరు 21.ప్రభాతవార్తప్రతిని:** రాజధాని విస్తరణ, మౌలిక వసతుల కల్పన కోసం నిర్వహిస్తున్న రెండో విడత భూసమీకరణ ప్రక్రియకు భూములిచ్చేందుకు రాజధాని ప్రాంత రైతులు ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగా వైకుంఠపురం గ్రామ పరిధిలోని మాదల కుటుంబం తమకు చెందిన 14.365 ఎకరాల భూమిని అమరావతి నిర్మాణం కోసం సీఆర్డీఏకు అందజేసేందుకు అంగీకరించింది. రాయపూడిలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మాదల శ్రీనివాసరావు కుటుంబసభ్యులు సీఆర్డీఏ అదనపు కమిషనర్ కొల్లాబత్తుల కార్తీక్‌కు అధికారిక అంగీకార పత్రాలను అందజేశారు. ఈ సమీకరణలో భాగంగా మాదల శ్రీనివాసరావు నుంచి 4.395 ఎకరాలు, మాదల అప్పారావు నుంచి 4.985 ఎకరాలు, అలాగే మాదల రాంబాబు నుంచి 4.985 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ బి. కన్యాకుమారి, ఇతర అధికారులు పాల్గొని రైతులకు ధన్యవాదాలు తెలిపారు.

## సాహిత్య దిగ్గజం గురుజాడ -మంత్రి కందుల దుర్గేష్




**అమరావతి.సెప్టెంబరు21,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు సాహిత్య దిగ్గజం, అభ్యుదయవాది, సంఘ సంస్కర్త మహాకవి గురుజాడ అప్పారావు జయంతిని రాష్ట్ర పం దుగగా అధికారికంగా జరుపుకోవడం ఎంతో సంతోష ˇదాయకమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమా టోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. సోమవారం మహాకవి గురుజాడ జయంతి సందర్భం గా ఆయన ఘనంగా నివాళులు అర్పిస్తూ ఒక ప్రకట న విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... "దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్" అంటూ తెలుగు జాతికి అ భ్యుదయ భావాలను, విశాల దృక్పథాన్ని అ దించిన మహనీయుడు గురుజాడ అని కొనియాడారు. మహాకవి గురుజాడ వారసులకు గతంలో నిలిచిపోయిన గౌరవ వేతనాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పునరుద్ధరించిందని, ఆ మహోన్నత మూర్తిని ప్రభుత్వం సగౌరవంగా స్మరించుకుంటోందని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు.

## రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట జెసి ప్రభాకర్ రెడ్డి ధర్నా..



**అనంతపురం క్రైమ్ సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:** అనంతపురంలోని రిజిస్ట్రార్ ఆఫీస్ ఎదుట సోమవారం తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత జెసి ప్రభాకర్ రెడ్డి ధర్నా నిర్వహించారు. తన అనుచరులతో పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్న ప్రభాకర్ రెడ్డి ఆఫీసు తోట కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. తాడిపత్రిలో వైసిపి నాయకుడు రమేష్ రెడ్డికి నిషేధిత 22 ఏ భూములను కట్టబెట్టారని ఆరోపించారు. ఇందులో కీలక పాత్ర పోషించిన సబ్ రిజిస్టర్లు మంజునాథ్, బసవరాజులపై చర్యలు తీసుకో వాలంటూ ఇదివరకే జిల్లా కలెక్టర్ ఆనంద్ కు సుమారు నెలన్నర రోజుల ముందే ఫిర్యాదు చేశామ న్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి నివేదికలు పంపాలని జిల్లా కలెక్టర్ సంబంధిత స్టాంప్స్ అండ్ డ్యూటీస్ డీ ఐ జీ కార్యాలయానికి ఆదేశాలు ఇచ్చారన్నారు. అయితే ఈ వ్యవహారం పై నెగ్గుతేల్చాల్సిన అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. దీంతో కాసేపు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బందో బస్తు నిర్వహించారు. చివరకు డీఐజీ విజయలక్ష్మి అక్కడికి చేరుకుని ప్రభాకర్ రెడ్డికి నచ్చచెప్పేందుకు ప్రయత్నించారు.

## 'నెయ్యిలో కల్తీ.. ఇడి రిపోర్ట్‌లో వెల్లడి




**తిరుపతి, సెప్టెంబరు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల వేంకటేశ్వరస్వామి లడ్డూప్రసాదాలకు గత వైసిపి హయాంలో కల్తీనెయ్యి జరిగిన ఉదంతం వాస్త వమేనని, దీనిపై సిబిఐ సిట్, ఇడి నివేదికలిచ్చినా వైసిపి నేతలు అబద్ధాలతో జనాన్ని నమ్మిస్తున్నారని తిరుపతి జనసేన పార్టీ ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్ అన్నారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో నెయ్యిలో కల్తీ జరిగిందని ఇడి రిపోర్ట్ ఇచ్చిని వైసిపి వాళ్ళకి ఇంగ్లీష్ రాదు అనుకుంటానని ఎద్దేవాచేశారు. రసా య నాలతో నెయ్యి తయారు చేశారని ఇడి స్పష్టం చేసిందన్నారు. మోనో గ్లిస రి న్ అనేది అనిమల్ ఫ్యాట్ తో తయారు చేస్తారని, చదువులేని వైసిపి నాయ కులకు ఇడి విడుదలచేసిన ప్రెస్ నోట్ అర్థం కాలేదని ఘాటుగా విమర్శించా రు.కత్తితో పొడిచిన, గొడ్డలితో నరికిన అది హత్యేనని, జగన్ తిరుమల అఖి లాండం వద్దకు వచ్చి కల్తీ జరగలేదని ప్రమాణం చేయగలరా అని కిరణ్‌రా యల్ సవాల్ విసిరారు. రూ.230 కోట్ల స్కామ్ జరిగిందని ఇడి చెప్తుంటే, జంతువుల కొవ్వు కలవలేదని సమర్థించుకోవడం దేనికి నిదర్శనమన్నారు. డి.సిఎం పవన్ కళ్యాణ్ పై లేనిపోని మాటలు వైసిపి నేతలు మాట్లాడు తున్నారని, నోరు అదుపులో పెట్టుకొని వాస్తవాలు మాట్లాడాలని అన్నారు.

## 27 నుంచి బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్

- 'శాప్ వైస్ ఛైర్మన్, ఎండి ఎస్.భరణి వెల్లడి



**విజయవాడ, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** 51వ సబ్ జూనియర్ జాతీయ బాస్కెట్‌బాల్ ఛాంపి యన్‌షిప్ పోటీలు సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 4, 2026 వరకు విజయవాడ నగరంలో నిర్వ హించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. భర ణి తెలిపారు. బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండి యా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వ ర్యంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి బాస్కె ట్‌బాల్ టోర్నమెంట్ ఏర్పాట్లపై సోమవారం విజ యవాడ ఇందిరాగాంధీ స్టేడియంలోని స్పోర్ట్స్ భవన్‌లో సంబంధిత శాఖల అధికారులతో ఎస్. భరణి సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహిం చారు. విజయవాడ నగరంలోని పలు క్రీడా వేదికల్లో పోటీలను నిర్వహించనున్నట్లు ఎస్.భరణి తెలిపారు. ప్రధానంగా ఆర్‌టీసీ కాలనీ - మేరిస్ స్టెల్లా కాలేజ్ ఇండోర్ స్టేడియం, పటమట చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియం, పటమట - కోనేరు బసవయ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం నందు సంబంధిత ఇతర క్రీడా వేదికల్లో పోటీలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పోటీల నిర్వహణలో వివిధ శాఖల మధ్య సమ న్వయం కోసం ప్రతి శాఖ తరఫున ఒక నోడల్ అధికారిని తక్షణమే నియమించి బాధ్యతలు అప్ప గించాలని ఎస్. భరణి ఆదేశించారు. జాతీయ స్థాయి క్రీడా పోటీలు విజయవంతంగా నిర్వ హించడం ద్వారా విజయవాడ నగరానికి మంచి గుర్తింపు వచ్చేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎస్. భరణి సూచించారు. ఈ సమావే శంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కాకర్ల కోటేశ్వరరావు, డిఇఒ చంద్రకళ, డి ఎం హె చ్ ఓ డా.ఏ. శ్రవణ్ బాబు, ఎలక్ట్రికల్ ఏడి రామ కృష్ణ, బాస్కెట్ బాల్ అసోసియేషన్ స్టేట్ సెక్రట రీ చక్రవర్తి, జిల్లా అధ్యక్షులు సుభాష్ చంద్రబోస్, మున్సిపల్ కార్పొరేషన్, అగ్నిమాపకశాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఉద్యోగ సంఘాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం: చీఫ్ సెక్రటరీ హామీ

**విజయవాడ, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** రాష్ట్ర సచివాలయంలో చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్‌తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు. కెఆర్ సూర్యనారాయణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న వివిధ ఉద్యోగ సంఘాలతో వారి సమస్యల పై చర్చించి వారి వద్ద నుండి వినతి పత్రాలు అందించారు. వివిధ డిపార్ట్మెంట్లకు చెందిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చీఫ్ సెక్రటరీ హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న వీఆర్ఏ, వీఆర్వో, సర్వేయర్లు సమస్య లు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తాము కోరగా, సమస్యలపై సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని చీఫ్ సెక్ర టరీ హామీ ఇచ్చినట్టు ఆంధ్రప్రదేశ్ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జెఎసి ఛైర్మన్ భూపతిరాజు రవీంద్ర రాజు తెలిపారు.

## ఎస్సీ వినాయక విగ్రహం మా వీధిలో ఊరేగిస్తే ఊరుకోం

- దళితులపై విరుచుకుపడ్డ అగ్రకులస్తులు
- ఇదెక్కడ న్యాయమంటూ పోలీస్ స్టేషన్ ఎక్కిన దళితులు



**రాజాం (విజయనగరం జిల్లా), సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :** విజయనగరం జిల్లా రాజాం మండలం సారధి గ్రామంలో ఆదివారం వినాయక విగ్రహం ఊరేగింపులో దళితులకు, అగ్ర కులస్తులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దళితుల వినాయక విగ్రహం మా అగ్ర కులస్తుల వీధిలో ఊరేగిస్తే ఊరుకోం అంటూ దళితులపై అగ్ర కులస్తులు విరుచుకుపడ్డారు. దీంతో దళితులు, అగ్ర కులస్తులు మధ్య వాగ్వాదం చోటు చేసుకుని కొట్లాటకు దారి తీసింది. మేము ఏం తప్పు చేసాం మా వినాయక విగ్రహాన్ని మీ వీధిలో తిరిగితే తప్పేముంది దళితులు ఆవేదన చెందారు. దేవుడు విషయంలో కూడా కుల వివక్ష చూపడం అన్యాయమని తెలిపారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని, అలాగే ఎస్సీ ఎస్టీ చట్టం అమలు చేయాలని సూచించారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గ్రామంలో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

## మద్యం దుకాణాల రెన్యువల్ గడువు పొడిగింపు

**అమరావతి, సెప్టెంబరు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** మద్యం దుకాణాల యజమానుల విజ్ఞప్తి మేరకు 2026-27 సంవత్సరానికి దుకాణాల రెన్యువల్ గడువును మరో రెండు రోజులు పొడిగించారు. దీంతో రెన్యువల్ చేసుకునేందుకు సెప్టెంబరు 23 వరకు అవకాశం కల్పించి నట్లయ్యింది. రాష్ట్రవ్యాప్తంగా 2026-27 సంవత్సరానికి 3,650 ఏ4 మద్యం దుకాణాలు నోటిఫై చేశారు. రెన్యువల్ ఆర్ఈటీ, దరఖాస్తు ఫీజు కింద మొత్తం రూ.933.44 కోట్ల డిమాండ్ ఉండగా, సెప్టెంబర్ 21 రాత్రి 7.15 గంటల నాటికి రూ.676 కోట్లు వసూలయ్యాయి. ఇంకా రూ.257 కోట్లు వసూలు కావాల్సి ఉంది.వార్షిక ఆర్ఈటీ కింద రూ.2,454.76 కోట్ల డి మాండ్ ఉండగా, ఇప్పటివరకు రూ.441 కోట్లు వసూ లయ్యాయి. అలాగే పర్మిట్ రూమ్ ఆర్ఈటీ కింద రూ. 249.15 కోట్ల డిమాండ్‌కు గాను రూ.62 కోట్లు వసూల య్యాయి. రెన్యువల్ ఆర్ఈటీ, వార్షిక ఆర్ఈటీ, పర్మిట్ రూమ్ ఆర్ఈటీలను కలిపి మొత్తం రూ.3,637.35 కోట్ల వార్షిక డి మాండ్ ఉంది. ఇందులో ఇప్పటివరకు రూ.1,179.63 కోట్లు వసూలు కాగా, రూ.450.55 కోట్లు బ్యాలెన్సా ఉంది. ఏ4 దుకాణాల యజమానుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణ నలోకి తీసుకుని ప్రభుత్వం రెన్యువల్ గడువును సెప్టెంబర్ 23 వరకు పొడిగించింది.

## బిసి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని విజ్ఞప్తి

**విజయవాడ, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్‌రోడ్డురవాణాసంస్థలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ ఏపి పిడిటీ బీసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎ సీ ్వ.శేషగిరిరావు విజ్ఞప్తి చేసారు. సోమవారం విజయవాడలోని ఆర్టీసిహౌ స్‌లో ఏపిఎస్ఆర్టీసి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ యం.శివప్రసాద్‌ను కలిసి సమస్యలపై వినతి పత్రం అందచేసారు. ఏపిఎస్ఆర్టీసిలో 19వేల మంది బీసీ ఉద్యోగులు పనిచేస్తున్నారని వారి సమస్యల పరిష్కారం పట్ల సానుకూలంగా వ్య వహరించాలని కోరారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఈ.కృష్ణారావు, యం.వి.రావు, వి.జానకిరామ్, టి.భరణి, పి.వి.రావు తదితరులు పాల్గొన్నారు.

## వేస్ట్‌పికర్స్, హెయిర్ పికర్స్‌కి ఉపకరణాలు పంపిణీ



**విజయవాడ, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :** రోడ్లవెంట చెత్త ఎరుకునే కార్మికులు, ఇళ్ళవెంట తిరుగుతూ వెంట్రుకలు సేకరించే నిరుపేద కార్మికులకు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఉపకరణాలను పంపిణీ చేసారు. విజయవాడలోని కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో రూ.3.20లక్షల విలువచేసే తోపుడుబళ్ళు, తోపుడు బుట్టలు, నాలుగు చక్రాల పుష్‌కార్ట్‌లు, అల్యూమినియం పాత్రలు, చీరల విక్రయానికి అవసరమైన సామాగ్రి, మసాలా విక్రయ వాహనాలు తదితర జీవనోపాధి ఉపకరణాలను 40మంది కార్మికులకు స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పటాభి, జిల్లా కలెక్టర్ లక్ష్మీశాలు అందచేసారు. ఈసందర్భంగా కొమ్మారెడ్డి పట్టాభి మాట్లాడుతూ నిరుపేద కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈఉపకరణాలను వినియోగించుకుని ఆర్థికస్థితిని మెరుగుపరచుకోవాలని ఆకాంక్షించారు. కలెక్టర్ లక్ష్మీశా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని వినియోగించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. ఈకార్యక్రమంలో డీబీఆర్‌సి డిప్యూటీ డైరెక్టర్ శామ్యూల్ అనిల్‌కుమార్, జిల్లాకోఆర్డినేటర్ జే.oˇమాదేవి, సిటీకోఆర్డినేటర్ రమేష్, ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

## పిజి డెంటల్ మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్

**విజయవాడ,సెప్టెంబరు21,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని ప్రైవేట్ నాన్‌మైనారిటీ డెంటల్ కళాశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి పీజీ డెంటల్ (ఎండీఎస్) మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీ ప్రక్రియ మొదలైంది. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఇందుకు సంబంధించిన అధికారిక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. నీట్‌ఎండీఎస్2026 అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ టి. సాయి సుధీర్ సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ఇవాళ రాత్రి 7 గంటల నుంచి ప్రారంభమైంది. ఈ నెల 24వ తేదీ రాత్రి 10 గంటల వరకు అప్లై చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఒకవేళ గడువులోగా దరఖాస్తు చేసుకోలేని వారు ఏకంగా రూ. 20 వేల ఆలస్య రుసుము చెల్లించి, ఈ నెల 25వ తేదీ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు నీట్‌ఎండీఎస్ 2026లో సాధించిన కటాఫ్ మార్కులను అధికారులు స్పష్టం చేశారు. మొత్తం 960 మార్కులకు కటాఫ్ స్కోర్లను నిర్దేశించారు.జనరల్ కేటగిరీ అభ్యర్థులకు 50వ పర్సంటైల్ (308 మార్కులు) ఉండాలి.జనరల్ పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు 45వ పర్సంటైల్ (289 మార్కులు) ఉండాలి.ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ అభ్యర్థులకు 40వ పర్సంటైల్ (271 మార్కులు) నిర్ణయించారు.దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 2026 మే 31 నాటికి తమ ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి ఉండాలని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు.

ప్రభుత్వ ఉత ్తర్వులు ప్రకారం ఏడాదికి ట్యూషన్ ఫీజు వివరాలను వర్సిటీ వెల్లడించింది. మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు కోర్సుల ఆధారంగా ఫీజుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.కేటగిరీబి (క్లినికల్ డిగ్రీ/డిప్లొమా): రూ. 7,85, 565,కేటగిరీసీ (పారా క్లినికల్ డిగ్రీ/డిప్లొమా): రూ. 5,74,7 59కేటగిరీసీ (ఎన్ఆర్ఐ / ఇన్‌స్టిట్యూషనల్ కోటా క్లినికల్): రూ. 15,87,000 కేటగిరీ సీ (పారా క్లినికల్): రూ. 9,25,7 50లుగా ఉన్నాయి. ఎం పికైన అభ్యర్థులు నాన్‌రిఫండబుల్ యూనివర్సిటీ ఫీజు కింద అదనంగా రూ. 54,600 చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకునే ముందు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లోని పూర్తి ప్రాస్పెక్టస్‌ను క్షుణ్ణంగా చదవాలని రిజిస్ట్రార్ సూచించారు.

## విద్యుత్ సమస్యలపై 103 వినతులు




**తిరుపతి, సెప్టెంబరు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** వినియోగదారుల నుండి అందే విద్యుత్ సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఎస్పీడిసిఎల్ సిఎండి శివ శంకర్ లోతేటి వెల్లడించారు. సోమవారం తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో డయల్ యువర్ సిఎండి కార్యక్రమాల ద్వారా 103 మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సిఎండి శివశంకర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం సంస్థ కార్పొరేట్ ఆఫీస్ నుండి నిర్వహించే డయల్ యువర్ సిఎండి, ఎస్ఇ కార్యాలయాల నుండి నిర్వహించే కార్యక్రమాల ద్వారా వినియోగదారులు సులభంగా తమ విద్యుత్ సమస్యలను పరిష్కరించుకునేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ఓల్టేజ్ లో హెచ్చుతగ్గులు, విద్యుత్ స్తంభాలు, లైన్ల మార్పు, వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరు సమస్యలను వినియోగదారులు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు.

## గ్రూప్1 పరీక్షల వివాదంపై హైకోర్టులో విచారణ

**విజయవాడ,సెప్టెంబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీపీఎస్సీ గ్రూప్1 పరీక్షల వివాదంపై సోమవారం హైకోర్టులో విచారణ జరిగింది. సిట్ సమర్పించిన నివేదికలతో జత చేసిన డాక్యుమెంట్ల కాపీలను అప్పీల్‌దారులకు అందించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు రిజిస్ట్రార్ జ్యూడీషియల్‌కు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది. గ్రూప్1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు.. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో పరీక్షకు సంబంధించిన వాస్తవాలను తేల్చేందుకు హైకోర్టు సీఐడీ డీజీ నేతృత్వంలోని సిట్‌తో విచారణ జరిపించింది. విచారణ పూర్తి చేసిన సిట్.. ప్రాథమిక, తుది నివేదికలను హైకోర్టుకు సమర్పించింది. అయితే ఈ నివేదికలతో జత చేసిన కీలక డాక్యుమెంట్లు తమకు అందించాలని కోరుతూ పలువురు అప్పీల్‌దారులు హైకోర్టులో అనుబంధ పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై తాజాగా విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఎంపికైన అభ్యర్థుల తరఫున సీనియర్ న్యాయవాది సీవీ రెడ్డి వాదనలు వినిపించారు.

## నిరుద్యోగ వెటర్నరీ డాక్టర్ల ఆందోళన

**విజయవాడ,సెప్టెంబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** నిరుద్యోగ వెటర్నరీ డాక్టర్లు జగన్ నివాసం ముట్టడించారు. తాడేపల్లిలోని జగన్ నివాసం వద్ద మహాధర్నాలో 164 మంది వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీపై వైఎస్సార్సీపీ తప్పుడు ప్రచారం చేసిందని ఆరోపించారు. వైఎస్సార్సీపీ హయాంలో ఒక్క వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టు కూడా భర్తీ చేయలేదని ఆరోపించారు. పోస్టులు భర్తీ చేస్తుంటే కుట్రలు చేస్తున్నారంటూ నిరుద్యోగ వెటర్నరీ డాక్టర్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్దేశ పూర్వకంగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల అమ్ముకుంటున్నారని వైసిపి ప్రచారం చేసిందన్నారు.మెరిట్ ప్రాతిపదికన ఎంపిక పరీక్షను ఎందుకు రద్దు చేసిందని ప్రశ్నించారు

## సబ్ రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

**అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తాడిపత్రిలో నిషేధిత భూములను రిజిస్ట్రేషన్ చేసినందుకు కనేకల్ సబ్ రిజిస్టర్ బసవరాజు, గుత్తి ఇన్ ఛార్జ్ సబ్ రిజిస్టర్,సీనియర్ అసిస్టెంట్ వై.మంజునాథ్ యాదవ్ లను సస్పెన్షన్ చేస్తూ సోమవారము స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ పి.విజయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. తాడిపత్రి మండలం వీరాపురం గ్రామంలో సర్వేనెంబర్ 683 లో సబ్ డివిజన్ 683తి లో 2.68 ఎకరాలు, 683తీ1 లో 2 ఎకరాలు, 683బి2 లో 2.11 ఎకరాలు మొత్తం 6.75 ఎకరాలను అప్పటి తాడిపత్రి సబ్ రిజిస్టర్ బసవరాజు, సీనియర్ అసిస్టెంట్ వై. మంజునాథ్ యాదవ్ లు నిర్లక్ష్యంగా , ప్రభు త్వ నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత భూములను 2024 జనవరి 20న రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. దీనిపై ఈ ఏడాది ఆగస్టు 24న తాడిపత్రి ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఇందుకు జిల్లా కలెక్టర్ స్పందించి విచారణ చేసి చర్యలు తీసుకోవాలని జిల్లా కలె క్టర్ అనంతపురం జిల్లా రిజిస్టర్ ను ఆదేశిస్తూ ఈనెల 8న ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై జిల్లా రిజిస్టర్ విచారణ చేసి నివేదికను ఈనెల 11న ఆ శాఖ డీఐజీ కి అందజేశారు. ఆ నివేదిక ఆధా రంగా సబ్ రిజిస్టర్ తో పాటు సీనియర్ అసిస్టెంట్ ను సస్పెన్షన్ చేస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

## క్వారీలో పడి ఇద్దరు బాలురు మృతి

**రాజుపాలెం, సెప్టెంబర్ 21 (ప్రభాతవార్త):** రాజుపాలెం మండలం కొండమోడు గ్రామ పరిధిలోని శర్మగారి క్వారీలో సోమవారం విషాద ఘటన చోటుచేసుకుంది. క్వారీలో పడి ఇద్దరు బాలురు మృతి చెందారు. వివరాల ప్రకారం.. ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన జిల్లా పోలీ రాజు (40) వద్దకు అతని చెల్లెలి కుమారులు, దుర్గి మండలం ముత్తుకూరు గ్రామానికి చెందిన చేవూరి సతీష్ (13), చేవూరి గౌతమ్ (7) వచ్చారు. బట్టలు ఉతుకుతున్న సమయంలో ప్రమాదవశాత్తు ఇద్దరూ జారి క్వారీలో పడిపోయినట్లు సమాచారం. ఈ ఘటనలో ఇద్దరు బాలురు మృతి చెందారు. మృతదేహాలను బ్రాహ్మణపల్లి మెడికల్ కాలేజీకి తరలించినట్లు తెలిపారు. ఘటనపై రాజుపాలెం ఎస్సై సిహెచ్ మణికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

# 16యేళ్ల నిరీక్షణకు తెర

## ● పొట్టిలంకలో రూ.4.88 కోట్లతో డబుల్ లేన్ వంతెన
## ● మంత్రులు నిమ్మల, దుర్గేష్, ఎంపి పురందేశ్వరి శ్రీకారం



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** గోదావరి ప్రాంత అభివృద్ధికి నీటి వనరులే కీలకం అని రాష్ట్ర జలవనరుల శాఖ, తూర్పుగోదావరి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పొట్టిలంకలో రూ.4.88 కోట్లతో నిర్మించనున్న డబుల్ లేన్ వంతెనకు మంత్రి కందుల దుర్గేష్, ఎంపి దగ్గుబాటి పురందేశ్వరితో కలిసి మంత్రి నిమ్మల శంకుస్థాపనలు చేశారు. శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మంత్రి రామానాయుడు మాట్లా డుతూ పొట్టిలంక వంతెన నిర్మాణం పరిసర గ్రామాల ప్రజల చిరకాల అవసరమని తెలిపారు. గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తర లించేందుకు రైతులకు ప్రయోజనం కలుగుతుం దన్నారు. జలం ఉంటేనే గ్రామం, అభివృద్ధి, నాగరికత సాధ్యమవుతాయని పేర్కొన్నారు. సాగునీరు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు జలవనరుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గోదావరి ప్రాంత ప్రజల ఆతిథ్యం, ఆప్యాయత, కృతజ్ఞతాభావాన్ని ప్రస్తావిస్తూ సర్ ఆర్థర్ కాటన్ చేసిన సేవలను ప్రజలు తరతరాలుగా గుర్తుంచుకోవడం గోదావరి ప్రజల ప్రత్యేకతకు నిదర్శనమన్నారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ పొట్టిలంక వంతెన కోసం ప్రజలు దాదాపు 16యేళ్లుగా ఎదురు చూస్తున్నారని, ఇప్పుడు ఆ కల సాకారం అవుతోందన్నారు. ఎంపి పురందేశ్వరి మాట్లా డుతూ పొట్టిలంక వంతెన స్థానిక ప్రజల చిరకాల డిమాండ్‌గా ఉందని, గతంలో పలుమార్లు శంకుస్థాపనలు జరిగినా నిర్మాణ పనులు ముందుకు సాగలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నాయకులు, ప్రజాప్రతి నిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పచ్చని వనంలో ఆధ్యాత్మిక పరిమళం

## ● రూ.1.83 కోట్లతో ఆరు ఎకరాల్లో నగరవనం ● 27 నక్షత్రాలకు ప్రతీకగా మొక్కలు శివ పంచాయతనవనం, మియావాకి ప్లాంటేషన్ ప్రత్యేక ఆకర్షణలు



**పిఠాపురం, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** పచ్చదనానికి ఆధ్యాత్మికతను జోడిస్తూ పిఠాపురంలో రూపుదిద్దుకున్న నగరవనం ప్రారంభమైంది. కేంద్ర ప్రభుత్వ 'నగర వన్ యోజన' కింద రూ.1.83కోట్లతో ఆరు ఎకరాల్లో అభివృద్ధి చేసిన ఈ వనాన్ని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ సోమవారం ప్రారంభించారు. మొక్క నాటి అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు ఆరోగ్యకరమైన జీవనానికి అవసరమైన పచ్చదనాన్ని అందించేలా దీనిని తీర్చిదిద్దారు.

**18 నగరవనాలలో భాగంగా ప్రారంభించిన పీఠికాపుర వనం:** నగరవనంలో పిల్లలు, నక్షత్రవనం, శివ పంచాయతనవనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పిఠాపురం ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంప్రదాయ విశ్వాసాలకు అనుగుణంగా మొక్కల ఎంపిక, అమరిక చేపట్టారు. 27 నక్షత్రాలకు ప్రతీకగా ఉసిరి, మేడి, మోదుగు, కొండమామిడి, పిప్పలి, వెదురు, రావి, మర్రి, జువ్వి, దేవదారు, జిల్లేడు, జమ్మి, వేప తదితర జాతుల మొక్కలను క్రమపద్ధతిలో నాటారు. వాటి విశిష్టతను పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.వీ. శివరామ ప్రసాద్ ఉప ముఖ్యమంత్రికి వివరించారు. మొక్కల అమరికను పవన్ కళ్యాణ్ ఆసక్తిగా పరిశీలించారు. శివుడి స్వరూపంగా భావించే మారేడు చెట్టుతో పాటు వినాయకుడు, విష్ణువు, అమ్మవారు, సూర్యభగ వానుడికి ప్రతీకలుగా భావించే మొక్కలను కలిపి శివ పంచాయతనవనం ఏర్పాటు చేశారు. 70 సెంట్ల విస్తీర్ణంలో మియావాకి విధానంలో మొక్కలు పెంచే ఏర్పాట్లు చేశారు. దీంతో తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పచ్చదనం పెంపొందించే అవకాశం ఏర్పడింది.

**మైసమ్మ చెరువుకు కొత్త రూపు:** అంతకుముందు ఫకృద్దీన్‌పాలెంలో సుందరీకరించిన మైసమ్మ చెరువును పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. ప్రధానమంత్రి కృషి సించాయి యోజన కింద రూ.73 లక్షలతో అభివృద్ధి చేసిన చెరువులో జిమ్, చిన్నారుల పార్కు తదితర సౌకర్యాలు కల్పించారు. చిన్నారులతో కలిసి పవన్ పిల్లల పార్కును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# టీచర్లపై దాడి.. ప్రభుత్వం సీరియస్

## ● ఏ ఒక్కరినీ వదిలిపెట్టొద్దని పోలీస్ ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశం

**విజయవాడ, సెప్టెంబరు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉపాధ్యాయులపై దాడి ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. దాడిలో పాల్గొన్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టొద్దని పోలీస్ ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు ఆదేశించారు. దీంతో కేసుల నమోదు, నిందితుల గుర్తింపు ప్రక్రియ వేగమైంది. సిసిటివి, వీడియో ఫుటేజ్ ఆధారంగా దాడిలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేతలు, రౌడీషీటర్లను గుర్తిస్తున్న పోలీసులు, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు. మూకుమ్మడి దాడులు, నిబంధనల ఉల్లంఘన, అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించిన అంశాలపై మాచవరం, సూర్యారావుపేట, కృష్ణలంక పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేస్తున్నట్లు సమాచారం. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో వీడియో ఫుటేజీలను అధికారులు పరిశీలిస్తుండగా, ర్యాలీ, దాడుల్లో పాల్గొన్న రౌడీషీటర్లను వెంటనే అదుపులోకి తీసుకోవాలని విజయవాడ పోలీస్ కమిషనర్ ఆదేశాలు వెళ్లాయి. మచిలీపట్నం, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి నగరాలకు చెందిన కొందరు రౌడీషీటర్లు దాడిలో పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. వైఎస్సార్‌సీపీ వర్గాలు కర్రలు, రాడ్లు, కోడిగుడ్లు, రాళ్లతో ముందస్తు ప్రణాళికతోనే దాడికి వచ్చినట్లు ప్రాథమికంగా గుర్తించిన పోలీసులు, వీడియో ఆధారాలతో నిందితులపై కఠిన చర్యలకు సిద్ధమవుతున్నారు.



## వరుణదేవుడి పలకరింపుతో చంద్రప్రభపై కలియుగదేవుడు

**తిరుమల, సెప్టెంబరు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలకొండపై సోమవారం రాత్రి వరుణదేవుడు పలకరించడంతో వర్షంతో చంద్రప్రభ వాహనంపై శ్రీనివాసుడు భక్తులను కటాక్షించాడు. సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో రాత్రి వైభవంగా చంద్రప్రభ వాహనసేవ జరిగింది. శ్రీవారికి సూర్యచంద్రులు రెండునేత్రాలు. ఉదయం సూర్యప్రభలో ఊరేగిన శ్రీనివాసుడు రాత్రి నిశాకరుడైన చంద్రప్రభతో కూడిన వాహనంపై విహరించాడు. చల్లనిదేవరప్రభతో మలయప్ప భక్తులకు దర్శనమిచ్చాడు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, బోర్డు సభ్యులు, టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి దంపతులు, సివిఎస్ఒ మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

**బ్రహ్మోత్సవాల వేళ.. తిరుమలలో భారీ వర్షం:** శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల వేళ గత రెండురోజులుగా వరుణదేవుడు పలకరించడంతో వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం రాత్రి ఉరుములు మెరుపులతో తిరుమలలో భారీ వర్షం కురిసింది. రాత్రి చంద్రప్రభ వాహనంసేవ ఘటోపాసానం మధ్యన ఊరేగింపు సాగింది. వాహనసేవ మొదలైన కొన్ని నిమిషాల్లోనే ఉరుములతో భారీ వర్షం ఆరంభమైంది. దీంతో భక్తులు, శ్రీవారు కూడా వరుణుడితో పోటీపడి ఊరేగింపుగా వెళ్ళారు. ఆలయ పరిసరాల్లోని భక్తులు వర్షంలో తడుస్తూ షెడ్ల కిందకు చేరుకున్నారు. శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తులు తడుచుకుంటూ క్యూ లైన్లలోకి ప్రవేశించారు. ఉదయం నుంచి మేఘావృతమైన ఆకాశం సాయత్రం నుండి కురిసిన ఈ వర్షం ఉపశమనం కలిగించింది. తిరుపతిలోని మాల్వాడిగుండం, కపిలతీర్థం జలాశయాలకు జలధార సాగుతోంది.



# వర్షాల నేపథ్యంలో విద్యుత్ శాఖ అప్రమత్తం

## విద్యుత్ సరఫరా పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్లు: సిఎండి

**తిరుపతి, సెప్టెంబరు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో బలమైన గాలి, వర్షం కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి, ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి మంగళవారం ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనుల పర్యవేక్షణకు ఒక్కో జిల్లాకు చీఫ్ జనరల్ మేనేజర్ స్థాయి అధికారిని నోడల్ ఆఫీసరుగా నియమించినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు అవసరమైన డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు, కండక్టర్, విద్యుత్ స్తంభాలు తదితర పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సంస్థ పరిధిలో సర్కిల్స్, డివిజన్స్ స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గాలి, వర్షం ప్రభావిత ప్రాంతాల్లో సరఫరా పునరుద్ధరణ పనులను వేగవంతం చేయడం కోసం అధికారులు/ సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు అందుబాటులో వుండాలన్నారు. వర్షం కురుస్తున్న సందర్భాల్లో ప్రజలు విద్యుత్ స్తంభాలను తాకవద్దని, లైన్ల కింద నిల్చోవద్దని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, లైన్లు తెగిపడడం లాంటి సంఘటనలను గుర్తించినట్లయితే తక్షణమే సమీపంలోని విద్యుత్ శాఖ అధికారులు/ సిబ్బందికి గానీ, విద్యుత్ బిల్లుపై ముద్రించబడిన తమ ప్రాంత ఎఇలకు గానీ టోల్ ఫ్రీ నంబర్లు 1912 గానీ 1800 425 155333కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. అదేవిధంగా సంస్థ వాట్సాప్ 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని సిఎండి లోతేటి సూచించారు.

# సాయికృష్ణ మిస్సింగ్ కేసు: సిట్ చార్జ్‌షీట్ దాఖలు

**విజయవాడ, సెప్టెంబరు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** గాదె సాయికృష్ణ మిస్సింగ్ కేసులో విజయవాడ ఎసిబి కోర్టులో సిట్ అధికారులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. పోలీసుల దాడిలో అతను మరణించాడని పేర్కొన్నారు. సాయికృష్ణ అరెస్టు, పోలీసుల దాడిలో అతను హత్యకు గురైన వైనంపై కీలక ఆధారాలను కోర్టుకు సిట్ అధికారులు సమర్పించారు. స్వయంగా కోర్టు విచారణకు సిట్ ఐవో సుధాకర్ బాబు హాజరయ్యారు. సాయికృష్ణ మిస్సింగ్ నుంచి మరణం వరకు చోటు చేసుకున్న పరిణామాలు, ఆయా ఘటనలను ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. ఈ కేసును ఎపి ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ చేయాలన్న ఆదేశాలకు అనుగుణంగానే విచారణ చేశామని సిట్ అధికారులు స్పష్టం చేశారు. సాయికృష్ణ మిస్సింగ్ కేసులో ఏడుగురిని నిందితులుగా చేర్చి సిట్ అధికారులు అరెస్టు చేసింది. సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి ఆరోపణల తర్వాత కృష్ణలంక పోలీసులు వ్యవహరించిన తీరును ఛార్జ్‌షీట్‌లో సిట్ అధికారులు పేర్కొన్నారు. టెక్నికల్ ఎవిడెన్స్, ఫోరెన్సిక్ ఎవిడెన్స్, సాక్షుల స్టేట్‌మెంట్లను సిట్ అధికారులు ఎసిబి కోర్టుకు సమర్పించారు. కృష్ణలంక పోలీసుల కస్టడీలోనే మే 12వ తేదీ రాణిగారితోటలో ఉన్న పాత ఆర్ అండ్ బి భవనంలో సాయికృష్ణ చనిపోయినట్టు తన చార్జ్‌షీట్‌లో సిట్ బయటపెట్టింది. ఇదే విషయాన్ని ఏ4 సురేష్ రిమాండ్ రిపోర్ట్‌లోనూ సిట్ తెలిపింది. కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో ఆధారాలను ధ్వంసం చేయడం నుంచి సాయికృష్ణ చనిపోయే వరకు జరిగిన సంఘటనల సాంకేతిక ఆధారాలను కోర్టుకు సిట్ సమర్పించింది. చార్జ్‌షీట్ ప్రకారం, సాయికృష్ణ కస్టోడియల్ డెత్‌లో కృష్ణలంక సిఐ నాగరాజుతో పాటు కానిస్టేబుళ్లు నాని, అశోక్ కీలక పాత్ర పోషించారు. మృతదేహాన్ని మాయం చేయడంలో సిఐ వ్యక్తిగత సహాయకుడు సురేష్ కీలకంగా వ్యవహరించారు.

# తిరుమల లడ్డూ పవిత్రత కోసం బిజెపి రాజీలేని పోరాటం

## ● కమలం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** తిరుమల లడ్డూ పవిత్రత కోసం భారతీయ జనతా పార్టీ రాజీలేని పోరాటం చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ పేర్కొన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సమన్వయంతో ముందుకెళ్తుందని, ఎన్నికలపై పార్లమెంటు నియోజకవర్గ స్థాయిలో చర్చలు జరుగు తున్నాయని వివరించారు. సోమవారం స్థానిక తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి బిజెపి కార్యాలయంలో మీడియా సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడారు. లడ్డూ ప్రసాదం తయారీలో నాణ్యతలేని నెయ్యి కానీ నెయ్యిని వాడినట్లుగా సిట్ చాలా స్పష్టంగా చెప్పిందని ఆయన తెలిపారు. ఈ కల్తీతో మనోభావాలు దెబ్బతిన్నాయని, తిరుమల లో కల్తీ నెయ్యి పై ఇప్పటిదాకా వైసిపి సమాధానం చెప్పడం లేదని దుయ్య బట్టారు. ప్రతిపక్ష నేతకు క్లీన్ చిట్ వారి స్వంత పత్రిక మాత్రమే ఇస్తుందన్నారు. నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా దేశవ్యాప్తంగా సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమం చేపట్టామని ప్రభుత్వ పథకాలను వీధి నాటకాల ద్వారా ప్రజల్లోకి మరింత బలంగా తీసుకువెళ్తాం అని రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ వెల్లడించారు. రానున్న ఎన్నికలలో కూటమి సమన్వయంతో ముందుకు వెళుతుంది. పార్లమెంటు స్థాయిలలో చర్చలు జరుగుతున్నాయని 2024లో ప్రజలు ఇచ్చిన తీర్పును మళ్ళీ పునరావృతం చేస్తామని ప్రకటించారు.



# జనసేనలోకి వైసిపి మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల వేళ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలు జనసేనలో చేరారు. సోమవారం పిఠాపురంలో జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమక్షంలో వివిధ ప్రాంతాలకు చెందిన 32 మంది వైసిపి నాయకులు జనసేన కండువా కప్పుకున్నారు. వారిలో మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ మున్సిపల్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, మాజీ వైస్ చైర్మన్ కనకాల సుబ్రమణ్యం మహా లక్షి ్మ, మాజీ కౌన్సిలర్లు, ఇతర నాయకులు ఉన్నారు. పెద్దాపురం, పిఠాపురం, సామర్లకోట, జగ్గంపేట నియోజ కవర్గాలకు చెందిన నాయకులు ఈ చేరికల్లో పాల్గొన్నారు. పవన్ కల్యాణ్ వారికి జనసేన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఎంపి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు, చైర్మన్లు వేగుళ్ల లీలా కృష్ణ, తోట సుధీర్, ఐదుగురు సభ్యుల కమిటీకి చెందిన మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఓ దూరి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులపై దాడి దుర్మార్గం

## ● దుండగులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం: హోం మంత్రి అనిత



**అమరావతి, సెప్టెంబరు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉపాధ్యాయులపై వైసిపి నాయకులు దౌర్జన్యానికి పాల్పడటం దుర్మార్గమని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. వైసిపికి రౌడీయిజం, దౌర్జన్యం చేయడానికే రాజకీయ పార్టీ పట్టిందా అని ప్రశ్నించారు. వైసిపి అధినేత జగన్‌కు చదువు, ఉపాధ్యాయుల పట్ల గౌరవం లేదని ఆమె విమర్శించారు. కరోనా సమయంలో ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద కాపలా పెట్టారని అనిత ఆరోపించారు. డిఎస్సీలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ తప్పుడు ప్రచారం చేసేందుకు వైసిపి అన్ని విధాలా ప్రయత్నిస్తోందని విమర్శించారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులను అవమానపరిచేలా మాట్లాడటం సరికాదని అనిత అన్నారు. అల్లరి సృష్టించాలనే ఉద్దేశంతోనే వైసిపి శ్రేణులు శాప్ కార్యాలయానికి వచ్చారని హోం మంత్రి ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయులు భావితరాలకు మార్గదర్శకులని అన్నారు. 'టీచర్ల తలలు పగిలేలా కొడతారా? టీచర్లను నోటికొచ్చినట్లు తిడతారా?' అని అనిత ప్రశ్నించారు. విద్య, ఉపాధ్యాయుల పట్ల గౌరవం ఉన్నవారు ఈ విధంగా వ్యవహరించరని అన్నారు. ఘటనకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు తమ వద్ద ఉన్నాయని, వాటి ఆధారంగా దాడులకు పాల్పడిన వారిని గుర్తించి అందరిపైనా కేసులు నమోదు చేస్తామని చెప్పారు. చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హోం మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు.

## గురువుల కష్టార్జితంపై 'ఫేక్' ముద్ర వేస్తారా?

### ● ప్రశ్నిస్తే దాడులకు దిగుతారా?: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ, సెప్టెంబరు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** కష్టపడి చదివి, క్రీడల్లో ప్రతిభ చాటి, నిబంధనల ప్రకారం మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం దెబ్బతీయడం సరికాదని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. మెగా డీఎస్సీపై వైఎస్సార్‌సీపీ చేస్తున్న ఆరోపణలను ఖండించిన ఆయన, శాప్ కార్యాలయం వద్ద చోటుచేసుకున్న ఉద్రిక్త పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. ప్రభుత్వ నిర్ణయంపై అభ్యంతరం ఉంటే నిరసన తెలియజేయవచ్చు. ఆధారాలుంటే సంబంధిత సంస్థల ముందు ఉంచవచ్చు. అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయించ వచ్చు. కానీ కష్టపడి ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులను ఫేక్ అంటూ అవమానించడం, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయడం సమంజసం కాదు. విజయవాడలో ఉపాధ్యాయులపై దాడి జరిగిం దన్న ఆరోపణలు అత్యంత తీవ్రమైనవి. ఘటనలో ఎవరు చట్టాన్ని అతిక్ర మించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## టీచర్లను అవమానించడం సరికాదు: మంత్రి వాసంశెట్టి

కష్టపడి చదివి, క్రీడల్లో ప్రతిభ చాటి, నిబంధనల ప్రకారం మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన వారిని ఫేక్ అంటూ అవమానించడం సరికాదని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం వేలాది మంది ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడం తగదని పేర్కొన్నారు. విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద సోమవారం చోటుచేసుకున్న పరిణామాలపై మంత్రి స్పందిస్తూ.. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ప్రభుత్వ నిర్ణయాలపై అభ్యంతరాలుంటే చట్టబద్ధ మార్గాల్లో నిరసన తెలియజేయవచ్చని అన్నారు. అయితే నిరసనలు భౌతిక ఘర్షణలకు దారి తీయకూడదని స్పష్టం చేశారు. ఘటనలో ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘించి ఉంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని మంత్రి సుభాష్ తెలిపారు.

## దాడులు క్షమించరాని నేరం: మంత్రి సవిత



**పెనుకొండ, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** గురు బ్రహ్మ, గురు విష్ణుః, గురు దేవో మహేశ్వరః అంటూ గురువులను దైవంగా కొలుచుకునే సమాజం మనదని, అటువంటి దైవాలపై గొడ్డలి పార్టీ గూండాలు దాడి చేయడం దారుణం, క్షమించరాని నేరం అని మంత్రి సవిత మండిపడ్డారు. ఒకవైపు లిక్కర్ స్కామ్, మరో వైపు గ్రూప్ 1 పోస్టుల మూల్యాంకనంలో అక్రమాలు బయటకు రావడంతో జగన్ బ్యాచ్‌లో గగ్గోలు మొదలైందని విమర్శించారు. టీచర్ల ఆత్మగౌరం దెబ్బతిసేలా, వారిని కష్టాన్ని తక్కువ చేసి చూపేలా మెగా డీఎస్సీలో అక్రమాలు అంటూ విష ప్రచారం మొదలు పెట్టారని ఆరోపించారు. జగన్‌కు దమ్ము, ధైర్యం ఉంటే మెగా డిఎస్సీ, గ్రూప్ 1 పోస్టుల మూల్యాంకనంపై చర్చకు రావాలని సవాల్ విసిరారు.

# వైభవోపేతంగా కాణిపాకం రథోత్సవం.. పోటెత్తిన భక్తజనం



**కాణిపాకం, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం స్వామివారికి రథోత్సవం అంగరంగ వైభవోపే తంగా జరిగింది. ఈమేరకు వేకువజామున దేవస్థానం వారిచే అర్చకస్వాములు స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలను నిర్వ హించి సర్వాంగ సుందరంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే ఉభయదారులు వరుస ఉభయం తీసుకురాగా సిద్ధి బుద్ధి సమేత గణ నాధుని ఉత్సవమూర్తులను అలంకార మండపం లో వుంచి అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహిం చారు. అనంతరం ఉదయం 10 గంటలకు ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయం నుండి తీసుకువచ్చి రథంపై ప్రతిష్ఠించి శాస్త్రోక్తంగా స్వామి అమ్మవార్లకు అర్చక స్వాములు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అశేషంగా తరలివచ్చిన భక్తజనం గణేష్ నామస్మరణల నడుమ కొంత దూరం లాగి వదిలిపెట్టారు. ఈసందర్భంగా భక్తులు నారికేళ కర్పూర హారతులతో పాటు రథంపై భక్తులు బొరుగులు, మిరియాలు, ఉప్పు చల్లి మొక్కులను తీర్చుకున్నారు. అలాగే మహిళలు పెత్తఎత్తున పిండి తలిగలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల గణేష్ నామస్మరణలు మిన్నంటుతుండగా స్వామివారు రథంపై కాణిపాకం పురవీదుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. రథోత్సవాన్ని తిలకించడానికి వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చిన అశేష భక్తజనంతో కాణిపాకం పురవీధులన్ని కిక్కిరి శాయి. రథోత్సవం సందర్భంగా ప్రఖ్యాత కళాకారులచే ప్రదర్శించిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా చిత్తూరు డీఎస్పీ వెంకట రమ, రూరల్ వెస్ట్ సీఐ శ్రీధర్‌నాయుడుల ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్, ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, రవీంద్రబాబు, ధనపాల్, హరిమాధవరెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజీనాయుడు, చిట్టిబాబు, స్థానిక మాజీ సర్పంచ్‌లు, శాంతిసాగర్ రెడ్డి, మధుసూధన్ రావు, మాజీ ఎంపీటీసీ లీలా సుధీర్‌లతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో డ్రగ్స్ నిందితుల కోసం పోలీసుల 96 గంటల భారీ ఆపరేషన్

## ● 74 మంది స్మగ్లర్ల అరెస్టు ● భారీగా గంజాయి, హెరాయిన్, 20 పిస్టళ్లు, ఆరు కత్తులు స్వాధీనం

**హైదరాబాద్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీలో నిషా ముక్త్ భారత్‌లో భాగంగా డ్రగ్స్ స్మగర్ల భరతం పట్టేందుకు పోలీసులు 96 గంటల భారీ ఆపరేషన్ చేబట్టారు. ఢిల్లీలోని రోహిణి జిల్లాలో జరిగిన ఈ ఆపరేషన్‌లో 74 మంది డ్రగ్స్ స్మగర్లు పట్టుబడగా ఇందులో ఆరుగురు ఆఫ్రికా దేశాలకు చెందిన వారున్నారు. ఈ సందర్భంగా నాలుగు కోట్ల 78 లక్షల రూపాయల విలువచేసే 44 కిలోల హైడ్రోపోనిక్ గంజాయితో పాటు 801 గ్రాముల హెరాయిన్, 104 గ్రాముల మార్ఫిన్, 17 గ్రాముల కొకైన్, 32 సింథటిక్ డ్రగ్ మాత్రలు పట్టుబడ్డాయి. అక్రమంగా వున్న 20 కంట్రీమేడ్ తుపాకులు, పిస్టోళ్లు, 31 తూటాలు, ఆరు కత్తులు, భారీగా నకిలీ సిగరెట్లు, నగదు లభ్యమయ్యాయి. దీంతో పాటు మూడు వాహనాలను, ఇనుపరాడ్లు, బలమైన తాళ్ల బండిళ్లను పోలీసులు జప్తు చేశారు. శుక్రవారం మొదలుపెట్టిన ఈ ఆపరేషన్ ఉదయం వరకు కొనసాగింది. మొత్తం 300 మంది పోలీసులు 16 పోలీసు బృందాలుగా విడిపోయి ఈ దాడుల్లో పాల్గొన్నాయి. పట్టుబడ్డ వారిలో 28 మంది తీవ్రమైన నేరచరిత్ర కలిగిన వారితో పాటు ఇద్దరు మైనర్లు వున్నారని ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఢిల్లీలోని రోహిణి ప్రాంత డిసిపి శశాంక్ జైస్వాల్ నేతృత్వంలో ఈ దాడులు జరిగాయి. దర్యాప్తు కొనసాగుతోంది.

## రేపటి నుండి పెంచలకోనలో పవిత్రోత్సవాలు

**రాపూరు (నెల్లూరు), సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో ఈ నెల 23వ తేది బుధవారం నుండి 26వ తేది శనివారం శ్రీవారికి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామిలు తెలిపారు. దేవస్థానంలో ప్రతి నిత్యం స్వామి వారికి నిర్వహించే నిత్యకైంకర్యాలు, ఉత్సవాలలో జరిగే లోపాలు, దోషాలు తొలగించి, ఆలయ పవిత్రతను కాపాడేందుకు ఈ పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నామని వివరించారు. పవిత్రోత్సవాలలో భాగంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వామి వారి పవిత్రోత్సవాలలో పాల్గొనే భక్తులు రూ.1500 చెల్లించి ఈ పూజలలో హోమాలలో పాల్గొనవచ్చని చెప్పారు. పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నందున, గురు, శుక్ర, శనివారాలలో స్వామి వారి నిత్య కళ్యాణం రద్దు చేయడం జరిగిందన్నారు. దీంతో పాటు శుక్రవారం నిర్వహించే అన్నకూటోత్సవం (తిరుప్పావడ) సేవ కూడా రద్దు పరిచినట్లు చెప్పారు. శనివారం సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ రద్దు చేశామని, భక్తులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారి పవిత్రోత్సవాలలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## బాలికపై లైంగిక దాడి.. పోక్సో కేసు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో ఎనిమిదేళ్ల బాలికపై 45యేళ్ల వ్యక్తి లైంగిక దాడికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మైనర్ బాలికకు తండ్రి లేరు, తల్లి విదేశాలకు బ్రతుకుతెరువుకై వెళ్ళింది. పోలీసులు కుటుంబ సభ్యుల వివరాల మేరకు తాళ్లరేవు రచ్చవారిపేటలో అమ్మమ్మ వద్ద ఉంటూ చదువుకుంటున్న 8 సంత్సరాల మైనర్ బాలిక పై అదే గ్రామానికి చెందిన రచ్చ దాసు అనే వ్యక్తి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన గత ఐదురోజుల క్రితమే జరిగినా వివరాలు బయటికి రాలేదు. ఆ కుటుంబంలో ఒక మహిళ పురిటి స్నానాలు సందర్భంగా బాలికను కుంకుడు కాయలతో స్నానం చేయిస్తుండగా మంట, రక్తస్రావం కావడం గమనించి కుటుంబ సభ్యులు బాలికను ఆరాతీయడంతో ఈ విషయం తెలిసింది. బాలిక అమ్మమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ వైద్య ఆరోగ్యశాఖ, శిశు సంక్షేమ శాఖ అధికారులతో కలిసి గ్రామం సందర్శించి విచారణ చేశారు. దాడికి పాల్పడిన రచ్చదాసును అరెస్టు చేసి పోక్సో కేసు నమోదుచేశారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చిన్నారి బాలిక పరిస్థితి పట్ల కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# సిబిఐ విచారణ జరిపించాల్సిందే

## ● వైసిపి స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణా రెడ్డి



**విజయవాడ, సెప్టెంబరు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** మెగా డిఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో టెట్ అర్హత లేని వారికి ఉద్యోగాలు ఇవ్వడం, ఇడబ్ల్యుఎస్ కోటాలో అక్రమాలు చేయడం, నకిలీ సర్టిఫికెట్లతో పోస్టులను అమ్ముకోవడం వంటి అనేక అక్రమాలు జరిగాయని వైసిపి స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణా రెడ్డి ఆరోపించారు. కోర్టును ఆశ్రయించిన తర్వాతే ఈ వ్యవహారం బయటకు వచ్చిందని, ఈ నియామక ప్రక్రియపై సిబిఐ వంటి స్వతంత్ర సంస్థతో నిష్పాక్షిక విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. డిఎస్సీ పర్యవేక్షణ చూసిన మంత్రులు పదవుల్లో కొనసాగకూడదని, శాంతియుత నిరసనలపై దాడి చేసి తిరిగి తమపైనే ఆరోపణలు చేయడం దారుణమని మండిపడ్డారు. "విజయ వాడలో జరిగిన ఘటనలు చూస్తే మీ ప్రభుత్వం ఎంతగా దిగజారిపోయిందో అర్థమవుతోంది. సిబిఐ విచారణ జరిపించాలని కోరుతూ విద్యార్థులు, నిరుద్యోగులతో కలిసి మా పార్టీ నాయకులు శాంతియుతంగా ర్యాలీ చేసేం దుకు వెళ్తే వారిని అడ్డుకున్నారు, లాఠీలతో కొట్టించారు, టీచర్ల ముసుగులో రౌడీలతో దాడులు చేయించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికి ర్యాలీలు చేసే హక్కు కూడా లేదా? అక్రమాలపై ప్రశ్నిస్తే సమాధానాలు చెప్పలేక, తట్టు కోలేక దిగజారిపోయి వ్యవహరిస్తున్నారు" అని రామకృష్ణారెడ్డి మండిపడ్డారు.

# చెలి



మన నిత్య జీవితంలో పెరుగును చాలా వంటకాల్లో భాగం చేసుకుంటాం. అయితే పదార్థాలతో పెరుగును తీసుకోవడం వల్ల కొంతమందికి

## పెరుగుతో కొన్ని పడకపోవచ్చు !

కొన్ని పడకపోవచ్చని, అలాంటి వాటికి దూరంగా ఉండడమే మంచిదంటున్నారు నిపుణులు. చేపలు, పెరుగు.. ఈ రెండూ కలిపి తీసుకోకూడదన్న విషయం చాలామందికి తెలుసు! ఎందుకంటే ఈ ఉత్పత్తులలో ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి. తద్వారా అజీర్తి సమస్య తలెత్తుతుంది. అంతే కాదు.. ప్రొటీన్లు ఎక్కువగా ఉంటే మాంసాహారంతోనూ దీన్ని కలపకపోవడమే మంచిదంటున్నారు నిపుణులు. మినపప్పుతో చేసిన పదార్థాలను పెరుగుతో కలిపి తీసుకుంటే కొంతమందిలో విరేచనాలు, కడుపుబ్బరం.. వంటి సమస్యలొస్తాయి! కొవ్వు పదార్థాలు, పెరుగు కలిపి తీసుకోవడం వల్ల కొంతమందిలో జీర్ణ ప్రక్రియ నెమ్మదిస్తుంది. అలాగే ఈ కాంబినేషన్ కొందరిలో బద్ధకం, మగత వంటి వాటికి కారణమవుతుందట. పెరుగుతో తయారుచేసే రైతన్నల్లో ఉల్లిపాయలు వేయడం చాలామందికి అలా అయితే ఈ కాంబినేషన్ కూడా కొందరికి పడకపోవచ్చు. ఈ రెండూ కలపడం వల్ల కొంతమందిలో జీర్ణ సమస్యలు, చర్మ అలర్జీలు వచ్చే అవకాశాలు ఉన్నాయి! వీహెల్ప్ కాబట్టి ఆయా పదార్థాలను పెరుగుతో కలిపి తీసుకున్నప్పుడు ఏదైనా ఉన్నట్లు అనిపిస్తే.. అలాంటి వాటికి దూరంగా ఉండడమే మంచిది. □

## బుఖారీ పులావ్



బాస్మతి బియ్యం : అర కిలో, మటన్: అర కిలో, క్యారెట్ తురుము: ఒక కప్పు, పచ్చి బఠాణీ: అర కప్పు, టమాట ముక్కలు: ఒక కప్పు, ఉల్లిగడ్డ: ఒకటి, పచ్చిమిర్చి: రెండు, జీడిపప్పు: పావుకప్పు, కిస్మిస్: ఒక టేబుల్ స్పూన్, అక్రోట్స్: ఐదు, నూనె: అర కప్పు, కారం: ఒక టేబుల్ స్పూన్, గరం మసాలా: ఒక టీస్పూన్, ధనియాల పొడి: ఒక టీస్పూన్, అల్లంవెల్లుల్లి పేస్ట్: ఒక టేబుల్ స్పూన్, పసుపు: ఒక టీస్పూన్, నెయ్యి: రెండు టేబుల్ స్పూన్లు, దాల్చిన చెక్క: రెండంగుళాల ముక్క, సాజీర: అర టీస్పూన్, యాలకులు: నాలుగు, లవంగాలు: ఆరు, అనాస పువ్వు: ఒకటి, ఉప్పు: తగినంత.

తయారీ: ముందుగా బాస్మతి బియ్యాన్ని అరగంటపాటు నానబెట్టుకుని పొడిపొడిగా వండాలి. స్టవ్‌మీద కుక్కర్ పెట్టి ఒక టేబుల్ స్పూన్ నెయ్యి వేసి వేడయ్యాక జీడిపప్పు, అక్రోట్స్, కిస్మిస్ జోడించి బాగా వేయించి పక్కన పెట్టాలి. అదే నెయ్యిలో నూనె వేసి దాల్చిన చెక్క, సాజీర, అనాస పువ్వు, యాలకులు, లవంగాలు వేయాలి. కాసేపు వేగాక తరిగిన ఉల్లిగడ్డ, మిర్చి, టమాట కలపాలి. అన్నీ బాగా వేగాక మటన్ వేయాలి. రెండు నిమిషాలు మగ్గిన తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్, కారం, ధనియాల పొడి, గరం మసాలా, పసుపు, క్యారెట్ తురుము, పచ్చిబఠాణీ, తగినంత ఉప్పు వేసి పది నిమిషాలు సన్నటి మంటపై మగ్గనివ్వాలి. అర లీటర్ నీళ్లు పోసి కుక్కర్ మూత పెట్టి ఐదు విజిల్స్ వచ్చేవరకు ఉడికించాలి. బాగా ఉడికిన మటన్‌లో.. ఉడికించి పెట్టుకున్న బాస్మతి రైస్ వేసి కలిపి పైనుంచి వేయించిన డ్రైఫ్రూట్స్, నెయ్యి వేసి మరో రెండు నిమిషాలు మూత పెట్టుకుంటే నోరూరించే బుఖారీ పులావ్ సిద్ధం. □

## మాతృత్వమే మిన్న !





ఈ మధ్యన 'బాడీ షేమింగ్' ఎక్కువైపోయింది. ఎవరెలా ఉంటే మనకెందుకు? వారి గురించి మనకు పట్టింపేమిటి? అని ఇంగితం లేకుండా సెలబ్రిటీస్‌ను ఆట పట్టించి మురిసిపోవడం నవతరం వంతయ్యింది. ఇలాంటి సందర్భాల్లో కొన్ని వికటిస్తాయి. మాతృత్వంలోనే ఉంది ఆడజన్మ సార్థకం అనుకున్నవారెవరైనా ఓ బిడ్డకు జన్మ నిచ్చి ఆవించి లాలించా లనీ అనుకుం టారు. యువతరం కలలరాణి అలానే అనుకుంది. 'అమ్మయ్యింది. జీవితానికి పరిపూర్ణత లభించినట్లేనని ఆమె కుటుంబ మంతా 'ఫీల్' అయ్యింది. 2025 నవంబరులో కాన్పు జరిగాక తాజాగా మొన్న వినాయక చవితినాడు అంబానీ ఇంట్లో భర్త విక్కీ కౌశల్‌తో దర్శనమిచ్చింది. సినీ యూత్‌కు కత్తిలా కనపడే కత్రినా కైఫ్ కాస్త లావెక్కినట్లు అనిపించింది. యువలోకం విలవిల్లాడిపోయింది. సినిమా లోకంలో సెలబ్రిటీస్‌కు పెళ్లయినా భరించలేని పాడులోకం ఒకటుందని తెలియనిది కాదు. అదొక మాయా లోకం కదా! మాతృత్వపు మధురిమలు అందుకొంటున్న కత్రినాకైఫ్‌కు కొంతమంది శాపనార్థాలు పెట్టేస్తూ ట్రోలింగ్ చేసేసారు. ఆవిడ బొద్దుగా ఉందని తట్టుకోలేకపోయారు. బతికినన్నాళ్లూఅందాలు విరిసిన అరబొమ్మలానే ఉండాలంటే సాధ్యమవుతుందా. అది ఆకర్షణ అనుకోవాలా? ఆరాధన అనుకోవాలా; ఎంత సెలబ్రిటీ అయినా ఓ వయసు వచ్చాక తనకూ ఓ పెళ్లి, పిల్లలు కావాలనుకుంటారు. అప్పుడు తమ శరీర వన్నెచిన్నెలు, బరువువంటివి విషయం పట్టించుకోరు. కుటుంబ సేవలోనే తాదాత్మ్య చెందుతారు. 'బాడీషేమింగ్'లో చిక్కుకున్న కత్రినాకైఫ్ స్పందన కూడా ట్రోలర్స్‌కి బుద్ధి చెప్పినట్లుగానే ఉంది. మరో సహనటున్ని పెళ్లి చేసుకుని సంసారం చేసుకుంటున్నా సమయంలో తనపై కామెంట్‌లను పట్టించుకున్నట్లు లేదు. కానీ సమాధాన మిస్తోంది. మనసును ప్రశాంతంగా ఉంచుకోవడమే ఏ వ్యక్తికైనా అవసరం. నిజమైన అందమంటే శారీరక, మానసిక ఆరోగ్యంతో ఉండడమేనని కత్రినా అభిప్రాయం. బాహ్య సౌందర్యాన్ని చూడడం కాదు ఆత్మ సౌందర్యమే అసలు సిసలు సౌందర్యమని హితవు పలుకుతోంది. మరో వైపు కత్రినాపై వస్తున్న విసుర్లను సహనటి ఖుష్బూ కత్రినాను సమర్థిస్తోంది. ఆ మాటకొస్తే ఏ మహిళా 'బాడీషేమింగ్'ను అంగీకరించదు. ప్రసవానంతరం మహిళల్లో వచ్చే శారీరక మార్పులను అర్థం చేసుకోకుండా హేళన చేయడం అవివేకమని కుండబద్దలు కొట్టినట్లు చెప్పజూశారు. పలువురు నటీ మణులు కూడా కత్రినాకు మద్దతు నిచ్చారు.□

## హనుమంతుని నవ అవతారాలు



హనుమంతుడిని స్మరించినంత మాత్రాన్నే బుద్ధి .. బలం .. యశస్సు .. ధైర్యం .. నిర్భయత్వం .. ఆరోగ్యం .. చైతన్యం .. వాక్పటిమ కలుతాయని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. అలాంటి హనుమంతుడు రామాలయా లలోను .. ఉపలయాలలోను .. ప్రధాన దైవంగాను పూజాభిషేకాలు అందుకుంటూ ఉంటాడు. భక్తులను అనుగ్రహించడం కోసం ఆయన నవ అవతారాలను ధరించాడు. ప్రసన్నాంజనేయ స్వామిగా .. వీరాంజనేయ స్వామిగా .. వింశతి భుజాంజనేయ స్వామిగా .. పంచముఖాంజనేయ స్వామిగా .. అష్టాదశ భుజాంజనేయ స్వామిగా .. సువర్చల సహిత ఆంజనేయస్వామిగా .. చతుర్భుజాంజనేయస్వామిగా .. ద్వాత్రింశద్భుజాంజనేయస్వామిగా .. వానరాంజనేయస్వామిగా ఆయన ఆయా క్షేత్రాల్లో కొలువై భక్తుల మనోభీష్టాలను నెరవేర్చుతున్నాడు. సకల దేవతల అనుగ్రహం ఆంజనేయస్వామికి ఉండేలా బ్రహ్మదేవుడి వరం వుంది. అందువలన హనుమంతుడిని పూజించడం వలన, సకల దేవతల అనుగ్రహం లభిస్తుందనేది పెద్దల మాట.

## కలసి నడుద్దాం..



ఆరోగ్యానికి నడకకు మించిన వ్యాయామం లేదని అందరికీ తెలిసిందే! కానీ, ఒంటరిగా భారంగా అడుగులు వేసిందానికన్నా, నచ్చిన వారితో జంటగా నడిస్తే మరింత ప్రయోజనం ఉందంటున్నారు పరిశోధకులు. అమెరికాకు చెందిన పర్డ్యూ యూనివర్సిటీ నిర్వహించిన అధ్యయనంలో ఈ సంగతి వెల్లడైంది. అధ్యయనంలో భాగంగా పరిశోధకులు రోజూ ఒంటరిగా వాకింగ్ చేసే 141 మందితో పాటు కలిసి నడిచే 72 జంటలనూ పరిశీలించారు. వారితో మాట్లాడారు. ఆరోగ్యానికి నడకకు మించిన వ్యాయామం లేదని అందరికీ తెలిసిందే! కానీ, ఒంటరిగా భారంగా అడుగులు వేసిందానికన్నా, నచ్చిన వారితో జంటగా నడిస్తే మరింత ప్రయోజనం ఉందంటున్నారు పరిశోధకులు. అమెరికాకు చెందిన పర్డ్యూ యూనివర్సిటీ నిర్వహించిన అధ్యయనంలో ఈ సంగతి వెల్లడైంది. అధ్యయనంలో భాగంగా పరిశోధకులు రోజూ ఒంటరిగా వాకింగ్ చేసే 141 మందితోపాటు కలిసి నడిచే 72 జంటలనూ పరిశీలించారు. వారితో మాట్లాడారు. ఇందులో తేలిందేమిటంటే, ఒంటరిగా వాకింగ్ చేస్తున్నవారి వేగం కంటే జంటగా నడుస్తున్న వారి వేగం తక్కువట. ఆరోగ్య పరీక్షలు బుక్ చేయండి దంపతులు ఊసులు పంచుకుంటూ ఆనందంగా నడవడమే వేగం తగ్గడానికి కారణం. కానీ, ఇలా కబుర్లాడుకుంటూ ఆనందాలు పంచుకోవడం వల్ల వేగం తగ్గినా వారి ఆరో గ్యం హెచ్చుతున్నదని పరిశోధకులు తేల్చారు. వాకింగ్ మాత్రమే కాదు, వ్యాయామం చేసే సమయం లోనూ జీవిత భాగస్వామి గానీ, స్నేహితులు గానీ తోడుంటే ఎక్కువ లాభాలు ఉంటాయి. వేరే కసరత్తులు సాధ్యపడక పోయినా వారానికి 150 నిమిషాలు జంటగా వాకింగ్ చేస్తే ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు సగానికి సగం తగ్గు తాయ" నిచెబుతున్నారు పరిశోధకులు. □

## నవ్వండి ప్లీజ్ !

మన స్ఫూర్తిగా నవ్వినప్పుడు ఒత్తిడి హార్మోన్ల స్థాయి తగ్గి ఎండార్ఫిన్లు విడుదలవుతాయి. ఇవి ఆందోళనను తగ్గిస్తాయి. అంతేకాదు, నవ్వు మన శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచి, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. రక్త ప్రసరణను మెరుగుపరిచి రక్తపోటుని నియంత్రిస్తుంది. సహోద్యోగులతో సరదాగా మాట కలుపుతూ... చిరునవ్వుతో పలకరించడం వల్ల పని ప్రదేశాల్లో సానుకూల వాతావరణం ఏర్పడుతుంది. టీమ్ వర్క్‌తోపాటు సభ్యుల్లో సృజనాత్మకత కూడా పెరుగుతుందట.



అందుకే కుదిరిప్పుడల్లా డెస్క్ పక్కవాళ్లతో మాట కలపడం, సరదాగా జోక్స్ వేసుకోవడం, సరదా సంఘటనల్ని గుర్తుచేసుకోవడం చేయాలి. నవ్వడం ఒక భోగం... నవ్వించడం ఒక యోగం... నవ్వలేకపోవడం ఒక రోగం! కాబట్టి మన ఒత్తిడి పోగొట్టుకోవడానికి కాస్త నవ్వుదాం ఏమంటారు! □

# తెర

## 'మైసా' కోసం నా లైఫ్‌నే ఇచ్చేశా: రష్మిక



రష్మిక మందన్న, రవీంద్ర పుల్లె, అన్‌ఫార్ములా ఫిల్మ్స్ పాన్ ఇండియా మూవీ 'మైసా' గూస్‌బంప్స్ ఇంటెన్స్ టీజర్ లాంచ్ టీజర్ లాంచ్ ఈవెంట్ లో హీరోయిన్ రష్మిక మాట్లా డుతూ.. టీజర్ మీ అందరికీ నచ్చడం చాలా ఆనందంగా ఉంది. ఇప్పటి వరకు పెర్ఫార్మెన్స్ అంటే ఎమోషన్స్‌తో చేశాను. ఇది నాకు కొత్త టెరిటరీ. ఇంత యాక్షన్ ఎప్పుడూ చేయలేదు. ఫస్ట్ టైమ్ చేసినప్పుడు ఒక నెర్వస్‌నెస్ ఉంటుంది. ఎప్పుడైనా ఒక క్యారెక్టర్ చేస్తున్నప్పుడు అందులో కొత్తదనం ఉండాలని నేను ఫీల్ అవుతాను. ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాలో ఎమోషనల్‌గా ఏముం టుందో అంతా ఆ ఫిల్మ్‌లో ఇచ్చాను. 'మైసా' కోసం నా లైఫ్‌నే ఇచ్చేశాను. డైరెక్టర్ రవీంద్ర మాట్లాడుతూ.. ఈ కథ రాస్తున్నప్పుడే రష్మిక గారు హీరోయిన్‌గా చేయాలని ఫిక్స్ అయి పోయాను. సీతారామం లో నేను పని చేశాను. అప్పుడే తను నా కొత్త హీరోయిన్ అనుకున్నాను. ఇప్పటి వరకు మీరు క్యూట్‌గా, స్వీట్‌గా ఉండే రష్మికను చూశారు. ఈ సినిమా లో రష్మిక ఫేస్ మీద బ్లడ్ పెడితే ఎలా ఉంటుందో అది చూస్తారు. ప్రొడ్యూసర్ అజయ్ మాట్లాడుతూ.. రష్మిక ఈ సినిమా కోసం ప్రాణాలు పెట్టి పని చేశారనిపిస్తుంది. కొన్ని కొన్ని స్టంట్స్ చేయడానికి లైఫ్‌ని కూడా రిస్క్ చేశారు. అద్భుతంగా వచ్చింది. గాయం కాకపోయి ఉంటే ఈపాటికి సినిమా పూర్తి అయి పోయేది. చాలా దట్టమైన అటవీ ప్రాంతంలో ఈ సినిమాని షూట్ చేశాం. చాలా గాయాలు కూడా అయ్యాయి. అలాంటి ప్రాంతాల్లో షూట్ చేయడం మామూలు విషయం కాదు.□

## ఇంప్యూర్ మూవీ ట్రైలర్ ఈవెంట్



వారాహి మల్లిపాముల, శ్రీదేవి మల్లిపాముల నిర్మించిన లేటెస్ట్ మూవీ ఇంప్యూర్. నిశాంతి ఇవని దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సాయి కృష్ణ, యష్న; అభిజిత్ ప్రధాన పాత్రల్లో నటించారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా తాజాగా ప్రీ రిలీజ్ ఈవెంట్ జరుపుకుంటుంది. ఈ ఈవెంట్‌లో నందినిరెడ్డి మాట్లాడుతూ.. ఈ ఈవెంట్‌కి రావడానికి రెండే మేయిన్ రీజన్స్ ఉన్నాయి. ఒకటి మా బాస్ కృష్ణవంశీ ఫోన్ చేసి చెప్పారు. ఆయన చెప్తే కాదనడానికి లేదు. సెకండ్ డైరెక్టర్ నిశాంతి గురించి. నిశాంతి నాకు 15 ఏళ్లుగా తెలుసు. నాకు మంచి ఫ్రెండ్. రీసెంట్‌గా మా ఇంటి బంగారంలో కలిసి చేశాము. పృథ్వీ సార్‌ను అందరూ 30 ఇయర్స్ ఇండస్ట్రీ అంటారు. కానీ ఎవర్ గ్రీన్ పృథ్వీ. ఎందుకంటే.. తెలుగు కానీ, తమిళం కానీ.. ఏ లాంగ్వేజ్‌లో అయినా మోస్ట్ టాలెంటెడ్ యాక్టర్. అందరికీ మంచి పేరు తీసుకు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. అని అన్నారు.30 ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీ రాజ్ మాట్లాడుతూ.. చదివింది ఆంధ్ర యూనివర్సిటీ ఎంఎ ఎకనామిక్స్ అయినా మాది తాడిపల్లి గూడెం ఇంగ్లీష్. అంటే.. ప్యూర్‌గా ఇంగ్లీష్ ఉండదు. వాళ్లు ఇంగ్లీష్‌లో చెప్తున్నప్పుడు కూడా నాకు ఏం తెలియకున్నా అన్ని అర్థమైనట్లు ఎక్స్‌ప్రెషన్ ఇస్తుంటా. డైరెక్టర్ నిశాంతి చేసిన కృషి, టాలెంట్‌ను వాళ్ల మదర్ ఎంకరేజ్ చేయడం నిజంగా గొప్ప విషయం. అన్నాడు.డైరెక్టర్ నిశాంతి మాట్లాడుతూ.. ఒక మనిషి ప్యూర్‌గా ఉండాలా? ఇంప్యూర్‌గా ఉండాలా? అనేది సొసైటి డిసైడ్ చేస్తుంది. వారాహి వచ్చి కథ నాకు చెప్పినప్పుడు బాగా కనెక్ట్ అయ్యాయి. ఒక పెళ్లి క్యాన్సల్ అవడం వల్ల ముగ్గురి పరిస్థితి ఎలా మారింది అనేది ఈ సినిమా కథ. హీరో సాయికృష్ణ మాట్లాడుతూ.. ముందుగా ఇక్కడికి వచ్చిన అందరికి చాలా ధన్యావాదాలు.

## 'ది ప్యారడైజ్' ప్రేక్షకుల అంచనాలని అందుకుంటుంది: నాని



**సెప్టెంబర్ మీకు బాగా కలిసి వచ్చింది కదా?**

నా కెరీర్ స్టార్ట్ అయిందే సెప్టెంబర్‌లో.'అష్టా చమ్మా' సెప్టెంబర్‌లోనే రిలీజ్ అయింది. 'భలే భలే మగాడివోయ్'కూడా సెప్టెంబర్‌లోనే వచ్చింది.

**జడల్ క్యారెక్టర్ గురించి చెప్పగానే మీకు ఏమనిపించింది?**

కథలో నుంచి వచ్చిన లుక్ అది. నాకు చాలా కొత్తగా అనిపించింది. ఇప్పటివరకు నేను చేసిన పాత్రలు అన్నీ బాగా రిలేటబుల్‌గా, తెలిసిన ఒక పర్సన్ లాంటి ఫీలింగ్ వచ్చే రోల్స్. ఇందులో క్యారెక్టర్ మాత్రం జనరల్ సొసైటీలో పెరిగిన వ్యక్తి కాదు. అది ఏంటి అనేది మీరు సినిమా చూస్తున్నప్పుడు అర్థం అవుతుంది.

**మీ సినిమాలంటే ఫ్యామిలీ ఆడియన్స్ కదా.. ఈ సినిమా ఎలా ఉంటుంది?**

ఫ్యామిలీ ఆడియన్స్ అందరూ చూసే సినిమా ఇది. మదర్‌సన్ ఎమోషన్ అద్భుతంగా ఉంటుంది. ఒక కమర్షియల్ సినిమా నుంచి ఏమైతే ఆశిస్తారో అన్నీ ఉన్నాయి. ఫ్యామిలీస్ అందరూ కలిసి హ్యాపీగా చూడొచ్చు.

**అనిరుధ్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఎలా ఉండబోతుంది?**

మేము 'జెర్సీ', 'గ్యాంగ్ లీడర్' చేశాం. బిగినింగ్ నుంచి ఎండ్ వరకు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ తో హోల్డ్ చేసి పట్టుకెళ్లే అవకాశం ఈ సినిమా తో వచ్చింది. వందకి రెండింతలు చేశాడు.

**మోహన్ బాబు క్యారెక్టర్ గురించి?**

శ్రీకాంత్ కథ చెప్పినప్పుడే మోహన్‌బాబు అయితే బాగుంటుంది అని అన్నాడు. కాకపోతే ఆయన ఈ క్యారెక్టర్ చేస్తారా లేదా అనేది నాకు డౌట్. ఎందుకంటే చాలా నెగెటివ్, బ్రూటల్ క్యారెక్టర్. శ్రీకాంత్ కథ చెప్పడానికి మోహన్ బాబు దగ్గరికి వెళ్లాడు.

**పాన్ ఇండియా ప్రమోషన్స్ గురించి?**

ఈ సినిమా కంటెంట్ అన్ని ప్రాంతాల్లో రీచ్ అయ్యి ఉంది. చాలా అద్భుతంగా రిసీవ్ చేసుకున్నారు. తమిళ్, హిందీ, కన్నడ, మలయాళం ప్రేక్షకులు ఎంతో ప్రేమను ఇస్తున్నారు.

**.మదర్ సెంటిమెంట్ గురించి?**

మా గ్లింప్స్‌ని రిలీజ్ చేసినప్పుడు ఒక తల్లి తన కొడుకు గురించి చెప్పే కథగా మొదలుపెట్టాము. టీజర్‌లో కూడా మెయిన్ ఎలిమెంట్ మదర్ మీదే కట్ చేశాము.

**'ప్యారడైజ్'అనేది ప్లేస్ గురించి?**

ప్యారడైజ్ అనే ప్లేస్‌లో సవారి అనే ఒక ట్రైబకు సంబంధించిన కథ ఇది. అక్కడ సవారీలకు గుర్తింపు లేదు. వాళ్ల ఉనికిని కూడా ఎవరు పట్టించుకోరు. వాళ్లని చంపేసినా సరే కేసు కూడా పెట్టరు.

## 'చకోర' అక్టోబరు 9న రిలీజ్



అక్టోబర్ 9 వరల్డ్ వైడ్ రిలీజ్ కాబోతున్న చకోర – High Joy Commercials బ్యానర్ పై డా. చింతాడ హేమారావు నిర్మాతగా, VIP Đ Vintage Iconic Pictures నిర్మాణ సారథ్యంలో మంగా శ్రీనివాస్ రచన దర్శకత్వంలో రూపొందిన మాస్ పోయెట్రీ మ్యూజికల్ లవ్ స్టోరీ చకోర – Lunar love Bird. శ్రవణ్, మలైకా టి. వాసుపల్ ను సరికొత్త ప్రేమ జంటగా పరిచయం చేస్తూ తెరకెక్కిన ఈ ప్రేమ కథ చిత్రాన్ని చూసి మెచ్చుకున్న శ్రీ లక్ష్మి పిక్చర్స్ బాపిరాజు గారు అత్యధిక మొత్తం చెల్లించి వరల్డ్ వైడ్ థియేట్రికల్ హక్కులను సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ డాక్టర్. చింతాడ హేమారావు మాట్లాడుతూ మా మొదటి ప్రయత్నంలోనే చకోర మూవీ ఓన్లీ థియేట్రికల్ రైట్స్ ద్వారానే టేబుల్ ప్రాఫిట్ లభించినందుకు గర్వపడుతున్నామని ఆనందాన్ని వ్యక్తపరచారు. శ్రీ లక్ష్మి పిక్చర్స్ బాపిరాజు మాట్లాడుతూ వేరే వాళ్ళు హక్కుల కోసం పోటీ పడుతున్నా తమకు ప్రాధాన్యత ఇచ్చి థియేట్రికల్ హక్కులు ఇచ్చినందుకుగాను ప్రొడ్యూసర్ డాక్టర్ చింతాడ హేమారావు కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని చెప్పారు. చకోర – Lunar Love Birde చిత్రం ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 9న థియేటర్లలో విడుదల కానుంది.

## 'ఏమో ఏమో ఇది' అక్టోబరు 30న విడుదల



రోషన్ మేక, ప్రీతి ముకుందన్ జంటగా శైలేష్ కొలను దర్శకత్వంలో యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌యువతను ఆకట్టుకునే ఆహ్లాదకరమైన ప్రేమకథా చిత్రంగా రూపొందుతున్న 'ఏమో ఏమో ఇద్ది విడుదల తేదీ ఖరారైంది. రోషన్ మేక, ప్రీతి ముకుందన్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని 2026 అక్టోబర్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ శీతాకాలంలో ప్రేక్షకులకు ఓ సరికొత్త ప్రేమానుభూతిని అందించేందుకు సినిమా సిద్ధమవుతోంది.HIT ఫ్రాంచైజీతో బ్లాక్‌బస్టర్ విజయాలను అందుకున్న రచయిత, దర్శకుడు శైలేష్ కొలను తొలిసారి ఓ ఆహ్లాదకరమైన ప్రేమకథతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. తనదైన థ్రిల్లర్ కథాంశాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆయన, 'ఏమో ఏమో ఇద్ధితో పూర్తిగా భిన్నమైన కథా ప్రపంచాన్ని ఆవిష్కరించబోతున్నారు. రోషన్ మేక, ప్రీతి ముకుందన్‌ల ఫ్రెష్ పెయిర్ ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. ఇప్పటికే విడుదలైన ది ఫస్ట్ బ్రీజ్ ఆఫ్ 'ఏమో ఏమో ఇది' వీడియోకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ వీడియో సినిమాపై పాజిటివ్ బజ్‌ను క్రియేట్ చేయడంతో పాటు, చిత్రంలోని ప్రేమకథ ఎలా ఉండబోతోందనే ఆసక్తిని పెంచింది. సితార ఎంటర్‌టైన్ మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ ఎస్., సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తుండగా, వంశీ పచ్చిపులుసు సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

## 'ఐ హేట్ మ్యారేజ్' నుంచి అప్పుడే పెళ్లా? సాంగ్ విడుదల



సుగి విజయ్, జుప్సీ భద్ర, హారిక రాజేందర్ హీరో హీరోయిన్లుగా పరమేష్ రేణుకుంట్ల దర్శకత్వంలో రూపొందుతోన్న విభిన్న ప్రేమకథా చిత్రం 'ఐ హేట్ మ్యారేజ్', ఆర్య సినిమా పతాకపంపై దయానంద్ మాదం, కార్తీక్ వెంపటి నిర్మిస్తున్న ఈ చిత్రం అక్టోబర్ చివరి వారంలో విడుదల కానుంది. ఈ సందర్భంగా బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ సినిమా చూశాను. నాకు బాగా నచ్చింది. ఈ సినిమా రూపొందిన విధానం నన్ను అలరించింది. తమ స్నేహితుడిని దర్శకుడిని చేయడం కోసం చిన్నప్పటి ఫ్రెండ్స్ అంతా కలిసి ఈ సినిమాను ప్రొడ్యూస్ చేశారు. కంటెంట్‌తో పాటు ఎమోషన్ ఉన్న సినిమా ఇది. ఈ బ్యూటఫుల్ లవ్‌స్టోరీలో యూత్‌కు మంచి సందేశం కూడా ఉంది. తప్పకుండా ఈ సినిమా థియేటర్లో సౌండ్ చేస్తుంది అన్నారు. దర్శకుడు పరమేష్ రేణుకుంట్ల మాట్లాడుతూ ఎంతో స్ట్రగుల్స్ మధ్య ఈ సినిమాను నిర్మించాను. నా కోసం నా స్నేహితులు ఈ సినిమా నిర్మించారు. జెన్ జీ బ్యాచ్‌కు కనెక్ట్ అయ్యే సినిమా ఇది. ఈ సినిమాలో హీరో, హీరోయిన్ క్యారెక్టర్‌తో తమను తాము స్క్రీన్ మీద చూసుకున్న ఫీలింగ్ కలుగుతుంది. ఈ సినిమాను ప్రత్యేకంగా వీక్షించిన కొంత మంది యూత్‌కు ఎంతో క్రేజీగా నచ్చింది అంటూంటే సినిమా విజయంపై మరింత నమ్మకం పెరిగింది అన్నారు. హీరోయిన్ జుప్సీ భద్ర మాట్లాడుతూ ఈ రోజు నేను ఇక్కడికి పెళ్లి కూతురు గెటప్‌లో ఎందుకు వచ్చానో ఈ సినిమా చూస్తే తెలుస్తుంది. అందరికి కనెక్ట్ అయ్యే సినిమా ఇది.

## 'సిగ్మా' లాంచ్ చేసిన రాజమౌళి



సందీప్ కిషన్ యాక్షన్‌అడ్వెంచర్, హీస్ట్ కామెడీ ఎంటర్టైనర్ 'సిగ్మా' అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియే టర్లలో విడుదల కానుంది. ఈ సినిమాతో జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రతి ష్టాత్మక లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రంపై ప్రమోషనల్ కంటెంట్‌తో ఆసక్తి పెరుగుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్, సాంగ్స్ సినిమాకు సంబంధించిన డిఫరెంట్ వరల్డ్‌ను, యాక్షన్ టచ్‌ను పరిచయం చేశాయి. కోస్తాంధ్ర, తెలంగాణలో మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ లిమిటెడ్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తుండగా, సీడెడ్ ప్రాంతంలో ఎన్వీఆర్ సినిమా విడుదల చేస్తుంది. తాజాగా దర్శక ధీరుడు ఎస్ఎస్ రాజమౌళి ఈ సినిమా తెలుగు థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. మోసపోయిన హీరో, జరిగిన దాన్ని మర్చిపోయి ముందుకు వెళ్లకుండా.. తనకు జరిగిన నష్టాన్ని తిరిగి సాధించుకోవాలని పోరాటం మొదలుపెడతాడు. డ్రగ్స్, గ్యాంబ్లింగ్‌కు సంబంధించిన రూ.500 కోట్ల భారీ రాకెట్ ఈ కథలో కీలకంగా ఉంటుంది. దీంతో హీరో క్రైమ్, మోసం, ప్రమాదాలతో కూడిన ప్రపంచంలోకి అడుగుపెడతాడు. మరోవైపు ఓ ఆర్‌జేతో ప్రేమలో ఉన్న హీరో.. తన స్నేహితుల సహాయంతో భారీ హీస్ట్‌కు ప్లాన్ చేస్తాడు. అయితే ఎంతో పక్కాగా వేసుకున్న ఆ ప్లాన్‌కు రెడ్డి అడ్డుపడటంతో మొత్తం ఆపరేషన్ గందరగోళంగా మారుతుంది. ఓటమిని అంగీకరించని హీరో మరింత బలంగా తిరిగి వచ్చి.. అన్ని అడ్డంకులను అధిగమించి తన లక్ష్యాన్ని ఎలా సాధించాడనేది ఆసక్తికరంగా మారింది.

# వెస్టిండీస్‌తో తొలి వన్డే

## మారిన టీమిండియా లైనప్

## రోహిత్, కోహ్లి రీ ఎంట్రీ

**న్యూఢిల్లీ:** ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న వన్డే సిరీస్‌లో భాగంగా వెస్టిండీస్ జట్టుతో భారత్ తలపడనుంది. తిరువనంతపురంలోని గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ స్టేడియం వేదికగా జరిగే ఈ తొలి సమరం కోసం భారత క్రికెట్ జట్టు ఇప్పటికే సన్నాహాలు ఆరంభించింది. వెస్టిండీస్ జట్టుతో జరగబోయే ప్రతిష్టాత్మక సిరీస్ ద్వారా సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి వన్డే జట్టులోకి రీఎంట్రీ ఇస్తున్నారు. ఇరు జట్ల మధ్య జరిగే తొలి మ్యాచ్‌లో ఓపెనర్లుగా రోహిత్ శర్మతో పాటు, కెప్టెన్ శుభ్ మన్ గిల్ బరిలోకి దిగనున్నారు. గతేడాది జులై నెలలో ఇంగ్లాండ్ తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో ఈ జోడీ అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. ఆ పర్యటనలో రోహిత్ 174 పరుగులు,




గిల్ 188 పరుగులు సాధించి అదరగొట్టారు. ఇప్పుడు అదే జోరును విండీస్ గడ్డపై కూడా కొనసాగించాలని భావిస్తున్నారు. ఇక మూడో స్థానంలో మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లి దిగనుండగా, ఆయన ప్రదర్శనపై అందరి చూపు నిలిచింది. ఇంగ్లాండ్ సిరీస్‌లో నిలకడైన ఆటతీరు కనబరిచిన కోహ్లి మరోసారి తన మార్క్ చూపించేందుకు సిద్ధమయ్యాడు. అలాగే శ్రేయాస్ అయ్యర్ అందుబాటులో లేకపోవడంతో నాలుగో స్థానంలో యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్‌ను బరిలోకి దించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయిదో స్థానంలో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న కేఎల్ రాహుల్ బ్యాటింగ్‌కు రానున్నాడు. గత 10 మ్యాచ్‌లలో 49.22 సగటుతో 443 పరుగులు సాధించిన రాహుల్ మిడిలార్డర్‌లో పాతుకుపోతున్నాడు. ఇక ఆల్‌రౌండర్లు నితీశ్ కుమార్, రవీంద్ర జడేజా మ్యాచ్‌ను ఫినిష్ చేసే బాధ్యతలను భుజాన వేసుకోనున్నారు. బౌలింగ్ విభాగంలో పేస్ దళాన్ని మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ కృష్ణ, గురనూర్ బ్రార్ మోయనుండగా, అదనపు పేసర్‌గా నితీశ్ సహకరిస్తున్నాడు. స్పిన్ బాధ్యతలను కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా సమర్థంగా నిర్వర్తించనున్నారు.

# ఆసియా క్రీడలు




### మహిళల టెన్నిస్‌లో

## పాక్ చిత్తు

### గెలుపుతో క్వార్టర్ ఫైనల్స్‌కు భారత్

### 0-3తో ఇరాన్ చేతిలో పురుషుల జట్టు ఓటమి

**టయోటా:** ఆసియా క్రీడలు టెన్నిస్‌లో భారత మహిళల జట్టు పాకిస్థాన్‌ను చిత్తు చేయగా, పురుషుల జట్టు ఇరాన్ చేతిలో ఓటమిపాలైంది. ఐచినగోయాలో సోమవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ మహిళల టేబుల్ టెన్నిస్ జట్టు పాకిస్థాన్‌పై 3-0 తేడాతో ఘన విజయం సాధించి గ్రూప్ ఎఫ్ నుండి క్వార్టర్ ఫైనల్స్‌లో స్థానం దక్కించుకుంది. కేవలం 10 నిమిషాల్లోనే అలీనా ఖాన్‌ను 11-3, 11-3, 11-4 తేడాతో ఓడించి సుతీర్థ ముఖర్జీ భారత్‌కు అద్భుతమైన ఆరంభాన్ని అందించింది. ఆసియా క్రీడల్లో తొలిసారిగా ఆడుతున్న సింద్రెలా దాస్, ఆ తర్వాత కల్సూమ్ ఖాన్‌పై 11-6, 11-7, 11-5 తేడాతో గెలిచి ఆధిక్యాన్ని మరింత పెంచింది. ఆకుల శ్రీజ 11-4, 11-4, 11-5 తేడాతో ఫాతిమా ఖాన్‌ను ఓడించి క్లీన్ స్వీప్ పూర్తి చేసింది. మరోవైపు పురుషుల జట్టు ఇరాన్‌తో 0-3 తేడాతో ఓటమి చవిచూసింది. మనుష్ షా, మానవ్ థక్కర్, హర్మీత్ దేశాయ్ అందరూ తమతమ మ్యాచ్‌లలో ఓడిపోయారు. కాగా ఆసియా క్రీడల టేబుల్ టెన్నిస్‌లో భారత్ మూడు పతకాలను గెలుచుకుంది, అవన్నీ కాంస్య పతకాలే.

### మిక్స్‌డ్ మార్షల్‌ఆర్ట్స్‌లో

## సుచికకు కాంస్యం

**నగోయా:** ఐచినగోయా క్రీడల్లో భాగంగా జరిగిన మహిళల సాంప్రదాయ 60 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించి, మిక్స్ మార్షల్ ఆర్ట్స్‌లో దేశానికి తొలి ఆసియా క్రీడల పతక విజేతగా నిలిచిన సుచిక తరియాల్ సోమవారం భారతదేశానికి చరిత్ర



సృష్టించారు. ఓవర్‌టైమ్ బౌట్‌లో సింగపూర్‌కు చెందిన హుయ్ హూన్ టియో చేతిలో స్వల్ప తేడాతో ఓటమి పాలవడంతో సెమీఫైనల్స్‌లో తరియాల్ చారిత్రాత్మక పరుగు ముగిసింది.
అత్యంత స్వల్ప తేడాతో ఓడిపోయిన ఈ భారత క్రీడాకారిణి, స్వర్ణ పతక పోరులో స్థానం కోల్పోయినప్పటికీ, ఎంఎంఏ ఆసియా క్రీడల అరంగేట్రంలో పోడియంపై స్థానం దక్కించుకుంది.
మంగోలియాకు చెందిన అల్తాంచిమెగ్ బైగల్మాపై 2-0 తేడాతో క్వార్టర్ ఫైనల్ విజయం సాధించి తరియాల్ సెమీఫైనల్ స్థానాన్ని ఖాయం చేసుకుంది. ఈ విజయంతో ఆమె మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్‌లో ఆసియా క్రీడల పతకం సాధించిన తొలి భారతీయ క్రీడాకారిణిగా నిలిచింది.



### కబడ్డీలో పురుషుల జట్టు

## విజయం

### జపాన్ 49-24 తేడాతో పరాజయం

**నగోయా:** డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ ఐచి ప్రిఫెక్చర్‌లోని టోకై సిటిజెన్స్ జిమ్నాసియంలో సోమవారం జరిగిన ఆసియా క్రీడల పురుషుల కబడ్డీ టైటిల్ భద్రపరిచే పోరాటాన్ని ఆతిథ్య జపాన్‌పై 49-24 తేడాతో సునాయాస విజయంతో ప్రారంభించింది. ఆసియా క్రీడల్లో తొలిసారిగా ఆడుతున్న అయాన్ లోహ్‌చాబ్, దేవాంక్ దలాల్, అషు మాలిక్ భారత దాడికి నాయకత్వం వహించగా, జట్టు అద్భుతమైన ఆరంభం పొందడంలో అషు కీలక పాత్ర పోషించాడు. జపాన్‌పై రెండు ఆల్‌అవుట్‌లు సాధించిన తర్వాత భారత్ 18-2 ఆధిక్యాన్ని సంపాదించగా, అషు మూడు పాయింట్ల సూపర్ రైడ్‌తో ఆరంభ ఆధిక్యాన్ని మరింత పెంచాడు. తొలి 20 నిమిషాల్లో మూడు ఆల్‌అవుట్‌లు చేసిన భారత్, తన ఆధిపత్యాన్ని కొనసాగించి 31-9 ఆధిక్యంతో విరామ సమయానికి వెళ్ళింది. అషు దాడికి నాయకత్వం వహించగా, రాహుల్ సేథ్‌పాల్ రక్షణలో బలమైన ఉనికిని అందించాడు. జపాన్ తన స్కోరింగ్ కోసం బోనస్ పాయింట్లపై ఎక్కువగా ఆధారపడింది, కానీ భారత్ ఒత్తిడిని కొనసాగించి ఆతిథ్య జట్టు అవకాశాలను కట్టడి చేసింది. ఆట తిరిగి ప్రారంభమైన వెంటనే, భారత్ మరో ఆల్‌అవుట్ చేసి తమ ఆధిక్యాన్ని 40-12కు పెంచుకుంది. ఆ తర్వాత జపాన్ చివరి దశలో భారత్‌పై ఆధిక్యం సాధించి తేడాను తగ్గించడంతో రెండు జట్లు స్కోరును 49-24కి తీసుకెళ్లాయి. అయితే, భారత్ తిరుగులేని ఆధిక్యాన్ని సంపాదించి, తమ తొలి గ్రూప్‌స్టేజ్ విజయాన్ని సునాయాసంగా ముగించింది.



### షూటింగ్: వ్యక్తిగత పోరులో

## హిమాన్షుకు రజతం

### రుద్రాంక్ష్‌కు కాంస్యం

**నగోయా:** ఐచినగోయా ఆసియా క్రీడల షూటింగ్ విభాగంలో సోమవారం భారత్ వ్యక్తిగత, టీమ్ పోటీల్లో రెండు రజతాలు, ఒక కాంస్యం సాధించాయి. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో భారత్ డబుల్ పోడియంను కైవసం చేసుకుంది. హోరాహోరీగా జరిగిన ఎనిమిది మంది ఫైనల్‌లో హిమాన్షు ధిల్లాన్ రజత పతకాన్ని, రుద్రాంకష్ పాటిల్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. హిమాంశు 252.4 పాయింట్లతో అగ్రస్థానంలో నిలవగా, రుద్రాంక్ష 230.9 పాయింట్లతో మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. ఫైనల్ అంతటా భారత షూటర్లు పతకం కోసం హోరాహోరీగా పోరాడారు. రుద్రాంక్ష అద్భుతమైన ఆరంభాన్ని అందుకున్నాడు. తొలి 10 షాట్‌ల తర్వాత అతను 106.0 పాయింట్లతో అగ్రస్థానంలో నిలవగా, అతని తర్వాతి స్థానాల్లో 104.9 పాయింట్లతో షెంగ్, 104.8 పాయింట్లతో హిమాంశు ఉన్నారు. ఇక సోమవారం జరిగిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో, హిమాన్షు ధిల్లాన్, పార్థ్ మానే, రుద్రాంక్ష్ పాటిల్ కలిసి 1,890.1 పాయింట్ల స్కోరు సాధించడంతో భారత్ రజత పతకాన్ని గెలుచుకుంది. 60-షాట్ క్వాలిఫికేషన్‌లో రుద్రాంక్ష్ 631.8 పాయింట్లతో భారత్ తరపున అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించి మూడవ స్థానంలో నిలిచాడు. హిమాంశు 630.0 పాయింట్లతో ఏడవ స్థానంలో నిలవగా, పార్థ్ మానే 628.3 పాయింట్లను అందించాడు. క్వాలిఫికేషన్‌లో టాప్ ఎనిమిది స్థానాల్లో నిలిచిన తర్వాత రుద్రాంక్ష్, హిమాంశు కూడా పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత ఫైనల్‌కు అర్హత సాధించాడు.



## హాకీలో భారత్ గెలుపు

### ఇండోనేసియా పరాజయం

**కకమిగహారా (జపాన్):** పూల్ బిలోని తమ రెండవ మ్యాచ్‌లో ఇండోనేషియాపై 17-1 తేడాతో ఘన విజయం సాధించింది. సోమవారం గిఫు ప్రిఫెక్చురల్ గ్రీన్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌తో పెనాల్టీ కార్నర్ల నుండి ఏడు గోల్స్, ఓపెన్ ప్లే నుండి 10 గోల్స్ రావడంతో, భారత్ యొక్క స్కోరింగ్‌లోని వైవిధ్యం వారి ఆధిపత్యాన్ని ప్రతిబింబించింది. డ్రాగ్‌ఫ్లిక్ స్పెషలిస్ట్ దీపికా సెహ్రావత్ (8, 28, 40 నిముషాల్లో) గోల్స్ చేయడంలో తన అద్భుత ప్రదర్శనను కొనసాగిస్తూ, హ్యాట్రిక్ సాధించి, కేవలం రెండు మ్యాచ్‌లలోనే టోర్నమెంట్‌లో తన గోల్స్ సంఖ్యను 11కి చేర్చింది. ఫార్వర్డ్ నవనీత్ కౌర్ (35, 56, 57వ నిముషాల్లో), రుతుజా పిసాల్ (15, 20, 38వ నిముషాల్లో) కూడా హ్యాట్రిక్‌లు పూర్తి చేశారు. సునెలిత టోప్పో (11, 30వ నిముషంలో), లాల్‌రెమ్సియామి హ్మార్జోటే (13, 16 నిముషంలో), సాక్షి రాణా (25, 57వ నిముషంలో) తలా రెండుసార్లు గోల్స్ చేయగా, కెప్టెన్ సలీమా టెటే (34వ నిముషం), ఇషికా చౌదరి (36వ నిముషం) చెరో గోల్ చేశారు.

# లాభాల్లో ముగిసిన సెన్సెక్స్,నిఫ్టీ



**ముంబయి, సెప్టెంబరు 21:** భారతీయ ఈక్విటీ మార్కెట్లు సోమ వారం సానుకూల ధోరణితో ముగిసాయి. ఆసియా మార్కెట్ల సాను కూల సంకేతాలు, ముడి చమురు ధరలలో స్వల్ప తగ్గుదలతో ఉత్సాహంగా ప్రారంభమైన మార్కెట్లు, చివరి వరకు అదే ఊపును కొనసాగించాయి. ఆఖరి గంటలో చోటుచేసుకున్న కొనుగోళ్ల మద్దతుతో బిఎస్ఇ సెన్సెక్స్ 329.78 పాయింట్లు ఎగబాకి 74,624.74 వద్ద ముగిసింది. అదేవిధంగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 కూడా 25.60 పాయింట్లు లాభపడి 23,372 వద్ద స్థిరపడింది. ఈనాటి ట్రేడింగ్‌లో లార్జ్ క్యాప్ షేర్లు సూచీలను ముందుకు నడిపించగా, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగాలలో మాత్రం కొంత అమ్మకాల ఒత్తిడి వ్యక్తమైంది. నిఫ్టీ 50 ప్యాక్‌లోని 50 కీలక షేర్లలో 33 కంపెనీల షేర్లు లాభాలలో ముగియగా, 17 కంపెనీల షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. సిమెంట్, పెయింట్స్, వినియోగదారు ఉత్పత్తుల రంగాలు మార్కెట్ ర్యాలీలో ప్రధాన పాత్ర పోషించాయి. అల్ట్రాటెక్ సిమెంట్ షేరు ఏకంగా 3.35 శాతం లాభపడి మార్కెట్ టాప్ గెయినర్‌గా నిలిచింది. ఏషియన్ పెయింట్స్ 1.96 శాతం, ఇండిగో 1.75 శాతం, సన్ ఫార్మా 1.33 శాతం, ఐటీసీ 1.24 శాతం మేర లాభపడ్డాయి. ఎల్ అండ్‌టి, ఎన్‌టిపిసి, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, టాటా స్టీల్, టైటాన్, కోటక్ మహీంద్రా బ్యాంక్, హిందుస్థాన్ యూనిలివర్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసిఐసిఐ బ్యాంక్ మరియు యాక్సిస్ బ్యాంక్ షేర్లు కొనుగోళ్ల ఆదరణతో లాభాల బాటలో ముగిసాయి. ఐటీ రంగానికి సంబంధించిన అడ్డంకులు ప్రభావంతో కొన్ని దిగ్గజ షేర్లు ఒత్తిడికి లోనై నష్టాలలో ముగిసాయి. ప్రధానంగా టెక్ రంగానికి చెందిన ఇన్ఫోసిస్ షేరు ప్రతికూల ట్రెండ్‌ను ఎదుర్కోగా, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, టెలికాం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నష్టాలు నమోదు చేసిన ప్రధాన స్టాక్స్‌గా నిలిచాయి. ఒరాకిల్ 18 బిలియన్ల డేటా సెంటర్ రుణ ఒత్తిడి వార్తల నేపథ్యంలో భారతీయ ఐటీ అనుబంధ సంస్థ ఒరాకిల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సాఫ్ట్‌వేర్ షేరు ఏకంగా 6.87 శాతం పడిపోయి రూ. 11,079 వద్ద అత్యంత భారీ నష్టాన్ని చవిచూసింది. రంగాల వారీగా పరిశీలిస్తే, ఆటో మరియు ఎఫ్ఎంసిజి రంగాలు మార్కెట్ లాభాలకు బలమైన ఊతాన్నిచ్చాయి. నిఫ్టీ ఆటో సూచీ 0.76 శాతం, నిఫ్టీ ఎఫ్ఎంసిజి సూచీ 0.62 శాతం చొప్పున పెరిగాయి. బ్యాంకింగ్ రంగం కూడా సానుకూలంగా స్పందించి నిఫ్టీ బ్యాంక్ సూచీని 0.13 శాతం లాభంతో ముగించింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగానికి ప్రతికూల వాతావరణం కొనసాగడంతో నిఫ్టీ ఐటీ సూచీ 0.66 శాతం క్షీణించింది. అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్‌లో బ్రెంట్ ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 101.6 స్థాయికి తగ్గడం, ఆసియా మార్కెట్ల నుండి వచ్చిన సానుకూల సంకేతాలు మరియు విదేశీ, దేశీయ సంస్థాగత పెట్టుబడిదారుల కొనుగోళ్లు మార్కెట్ స్థిరత్వానికి కారణమయ్యాయి. లార్జ్‌క్యాప్ విభాగంలో లాభాలు ఉన్నప్పటికీ, నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ0.27 శాతం మరియు నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.10 శాతం చొప్పున నష్టాల్లో ముగిసాయి. అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్‌లో బ్రెంట్ ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 101.6 స్థాయికి తగ్గడం, ఆసియా మార్కెట్ల నుండి వచ్చిన సానుకూల సంకేతాలు మరియు విదేశీ, దేశీయ సంస్థాగత పెట్టుబడిదారుల కొనుగోళ్లు మార్కెట్ స్థిరత్వానికి కారణమయ్యాయి.

## బిట్‌కాయిన్ మళ్లీ 85,000 డాలర్లు పైనే..



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21:** బిట్‌కాయిన్ సోమవారం మళ్లీ 85,000 డాలర్ల స్థాయిని అధిగమించింది. రికవరీ కొనసాగుతుండగా, మరోవైపు బ్రెంట్ క్రూడ్ ధర వరుసగా నాలుగో సెషన్‌లోనూ తగ్గింది. బిట్‌కాయిన్‌కు సం స్థాగత పెట్టుబడుల అంబిట్‌కాయిన్ పుంజుకోవడానికి సంస్థాగత పెట్టుబడుల డిమాండ్ పెరగడం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. బిట్‌కాయిన్ ఆధారిత ఎక్స్ఛేంజ్‌ట్రేడెడ్ ఫండ్స్‌లో గత వారం 433.03 మిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. దీంతో వారానికి సంబంధించిన నిధుల ప్రవాహం మొత్తం 6.21 మిలియన్ డాలర్లకు పాజిటివ్‌గా మారింది. సెప్టెంబర్‌లో ఇప్పటివరకు నమో దైన మొత్తం ఈటిఎఫ్ ఇన్‌ఫ్లో 313.63 మిలియన్ డాలర్లకే పరిమితమైంది. ఇది ఆగస్టులో నమోదైన 3.52 బిలియన్ డాలర్లతో పోలిస్తే చాలా తక్కువ.బిట్‌కాయిన్ ఇప్పుడు గత మేలో నమోదైన 82,850 డాలర్ల స్థాయిని దాటింది. కొనుగోళ్ల ఊపం పెరగడంతో మార్కెట్‌లో పైకి కదిలే వేగం బలపడుతోంది. అయితే రిలేటివ్‌స్ట్రెంత్ ఇండెక్స్ ఆర్ఎస్ఐ సుమా రు 71కి చేరింది. సాధారణంగా ఈ స్థాయి మార్కెట్‌లో ధరలు కొంత ఎక్కువగా విస్తరించిన పరిస్థితిని సూచిస్తుంది. బిట్‌కాయిన్ మార్కెట్ తదుపరి కీలక స్థాయిగా 90,000 డాలర్లవరకూ వెళుతుందని ట్రేడర్లు గమనిస్తున్నారు.

## టాటాగ్రూప్‌లో ఎల్ఐసి పెట్టుబడులు లక్ష కోట్లు




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** ప్రభుత్వరంగంలోని అతిపెద్ద బీమా సంస్థ ఎల్ఐసి దేశంలోని స్టాక్స్, మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేసే అతిపెద్ద డొమెస్టిక్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్‌గా నిలిచింది. అందుకే ఎల్ఐసీ నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ కూడా రూ. లక్షల కోట్లు ఉంటుందని చెప్పొచ్చు. టాటా గ్రూప్‌లో ఎల్ఐసీ పెట్టుబడుల టాటా సన్స్ ఛైర్మన్‌గా 2022 జూన్‌లో చంద్రశేఖరన్ రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత టాటా గ్రూప్ వివిధ లిస్టెడ్ కంపెనీల్లో ఎల్ఐసీ తన వాటాలను గణనీ యంగా పెంచింది. ప్రైమ్ డేటా బేస్ డేటా ప్రకారం సుమారు 14 టాటా కంపెనీల్లో 10 సంస్థల్లో వాటా పెరగడంతో ఎల్ఐసీ పెట్టుబడుల విలువ ఈ టాటా గ్రూప్‌లోనే ఏకంగా రూ. 1 లక్ష కోట్ల మార్కును అధిగమించింది. టాటా ఎల్క్సీ లో ఎల్ఐసీ వాటా సుమారు 1.04 శాతంగా ఉంటే, అదే ఇప్పుడు 6.59 శాతానికి చేరింది. ఈ క్రమంలో టాటా ఎల్క్సీ షేర్ ధర 202022 మధ్య భారీగా పెరగడంతో 2022 ఆగస్ట్ సమయంలో ఏకంగా రూ. 10238 స్థాయిని తాకింది. టాటా కన్జ్యూమర్ ప్రొడక్ట్స్‌లో ఎల్ఐసీ వాటా 3 శాతం వరకు పెరిగి 8.23 శాతానికి చేరింది. ఇదే సమయంలో టాటా కెమికల్స్‌లో 6.79 శాతం నుంచి 9.24 శాతానికి ఎగబాకింది.

# భారత్-న్యూజిలాండ్ వాణిజ్య ఒప్పందం అక్టోబర్ 20 నుంచి అమలు

## కెనడాతో సెపా చర్చల్లో వేగం, అక్టోబర్ 5 నుంచి ఐదో విడత సమావేశం




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** భారత్ వాణిజ్య సంబంధాల్లో కీలక పరి ణామం చోటు చేసుకుంది. భారత్- న్యూజిలాం డ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అక్టోబర్ 20న, విజయద శమి రోజున అమల్లోకి రానుంది. మరోవైపు కెనడాతో సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం చర్చలను వేగవంతం చేయాలని ఇరు దేశాలు నిర్ణయించాయి.అక్టోబర్ 20 నుంచి న్యూజిలాండ్‌తో ఎఫ్‌టిఎ, భారత్-న్యూజిలాండ్ ఎఫ్‌టిఎ అమలులోకి వచ్చే తేదీని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సోమవారం వెల్లడించారు. న్యూఢిల్లీలో న్యూజిలాండ్ వాణిజ్య, పెట్టుబడుల మంత్రి టాడ్ మెక్‌క్లేతో జరిగిన వర్చువల్ సమావేశంలో ఆయన ఈ విషయాన్ని ప్రకటించారు.ఒప్పందం అమల్లోకి వచ్చిన రోజు నుంచే భారత్ నుంచి న్యూజిలాండ్‌కు ఎగుమతి అయ్యే 100 శాతం ఉత్పత్తులకు సుంక రహిత మార్కెట్ ప్రవేశం లభించనుంది.ఈ ఒప్పందం అమలు రెండు దేశాల ఆర్థిక భాగస్వామ్యంలో కీలక మైలురాయిగా నిలుస్తుందని గోయల్ పేర్కొన్నారు. బలమైన, మరింత విస్తృతమైన వాణిజ్య సంబంధాలను నిర్మించేందుకు భారత్, న్యూజిలాండ్‌కు ఉన్న ఉమ్మడి నిబద్ధతకు ఇది నిదర్శనమని అన్నారు.విజయదశమి సందర్భంగా అక్టోబర్ 20న భారత్-న్యూజిలాండ్ ఎఫ్టీయే అమల్లోకి రానుంది. ఇది ఇరు దేశాలకు విజయమేనని గోయల్ ఎక్స్‌లో పేర్కొన్నారు.ఈ ఒప్పందం కోసం కృషి చేసిన న్యూజిలాండ్ మంత్రి మెక్‌క్లే, ఇరు దేశాల చర్చల బృందాలను గోయల్ అభినందించారు. ఒప్పందం న్యాయబద్ధంగా, సమతుల్యంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో భారత్-న్యూజిలాండ్ ఆర్థిక సం బంధాలు మరింత వేగం పుంజుకున్నాయి. న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ భారత్‌లో పర్యటించడం, అనంతరం 2026 జూలైలో ప్రధాని నరేంద్ర మోడీన్యూజిలాండ్‌ను సందర్శించడం ద్వైపాక్షిక సంబంధాలకు మరింత ఊతమిచ్చాయి. 2030 నాటికి భారత్-న్యూజిలాండ్ వ్యూహాత్మక భాగస్వామ్యం, రోడ్‌మ్యాప్‌లో భాగంగా రాబోయే నాలుగైదేళ్లలో వస్తువులు, సేవల ద్వైపాక్షిక వాణిజ్యాన్ని దాదాపు రూ.35,000 కోట్లకు రెట్టింపు చేయాలనే లక్ష్యం ఉంది.2026 ఏప్రిల్ 27న న్యూఢిల్లీలో భారత్-న్యూజిలాండ్ ఎఫ్టీయే పై సంతకాలు జరిగాయి. ఇదిలా ఉండగా, భారత్-కెనడా మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం సెపా చర్చలను వేగవంతం చేయాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. చర్చల ఐదో విడత అక్టోబర్ 5న ప్రారంభం కానుంది.కెనడా అంతర్జాతీయ వాణిజ్య మంత్రి మానిందర్ సిద్ధూతో ముంబైలో జరిగిన సమావేశంతో సెపా చర్చల నాలుగో విడత ముగిసిందని గోయల్ తెలిపారు.చర్చలు సానుకూలంగా సాగాయని, ఇకపై చర్చల వేగాన్ని పెంచాలని ఇరు దేశాలు అంగీకరించాయని ఆయన చెప్పారు. అక్టోబర్ 5న ఐదో విడత చర్చలు ప్రారంభమవుతాయని, రాబోయే 90 రోజులు భారత్-కెనడా సంబంధాలకు కీలక కాలంగా మారవచ్చని గోయల్ పేర్కొన్నారు.

# చైనాకు మేడిన్ ఇండియా ఎగుమతులు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** భారత్ నుంచి చైనాకు ఎగుమతులు అనూహ్యంగా వృద్ధి చెందుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సం వత్సరం మొదటి ఐదు నెలల్లో (ఏప్రిల్‌ఆగస్టు) చైనాకు భార త ఎగుమతులు సుమారు 40 శాతం మేర పెరిగాయి. ముఖ్యంగా మేడ్ ఇన్ ఇండియా ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు ఈ వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయినప్పటికీ, ఇరు దేశాల మధ్య వాణిజ్య లోటు ఇప్పటికీ చైనాకు అనుకూలంగా కొనసాగుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో చైనాకు భారత ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు మూడు రెట్లు పెరిగి 3.18 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. స్మార్ట్‌ఫోన్లు, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు, డిస్‌ప్లే మాడ్యూల్స్ వంటివి వీటిలో ప్రధానమైనవి. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌ఆగస్టు మధ్య కాలంలోనూ ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 15 శాతానికి పైగా పెరిగాయి. ఇదే సమయంలో ఇంజినీరింగ్ వస్తువుల ఎగుమతులు సైతం 21 శాతం మేర వృద్ధిని నమోదు చేశాయి. అంతర్జాతీయంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సెంటర్ల కోసం అత్యాధునిక పరికరాలకు డిమాండ్ పెరగడమే ఈ వృద్ధికి ప్రధాన కారణమని పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. "ప్రపంచంలోనే అత్యంత పోటీతత్వంతో కూడిన సరఫరా వ్యవ స్థలో భారత తయారీ రంగం తన విశ్వసనీయతను చాటుకుంటోంది" అని ఇండియన్ సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ ఛైర్మన్ పంకజ్ మోహింద్రూ పేర్కొన్నారు. అయితే, ఈ వృద్ధి స్వల్ప స్థాయి నుంచి ప్రారంభమవడంతో చైనాతో నెలకొన్న భారీ వాణిజ్య లోటుపై చెప్పుకోదగ్గ ప్రభావం చూపలేదు. గత ఆర్థిక సంవత్సరంలో చైనా నుంచి భారత్ దిగుమతులు 131.6 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ప్రస్తుతం భారత ఎగుమతులకు అమెరికానే అతిపెద్ద మార్కెట్‌గా కొనసాగుతోంది.

# డిజిటల్ పేమెంట్స్ రంగంలోకి యాపిల్‌పే




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** భారత డిజిటల్ చెల్లింపుల మార్కెట్లోకి ప్రపంచ టెక్ దిగ్గజం యాపిల్ అడుగుపెడుతోంది. గ్లోబల్ మార్కెట్‌లో యాపిల్ పే అందుబాటులోకి వచ్చిన దాదాపు పుష్కర కాలం తర్వాత భారత్‌లో లాంచ్ అవుతోంది. ప్రస్తుతం దేశీయంగా 84 శాతానికి పైగా మార్కె ట్‌ను శాసిస్తున్న ఫోన్‌పే, గూగుల్ పే ఆధిపత్యానికి ఇది ఎంతవరకు గండి కొడుతుందనే దానిపై ప్రస్తుతం ఉత్కంఠగా ఉంది. ప్రస్తుతం భారత్‌లో వీధి వ్యాపారుల నుంచి భారీ షాపింగ్ మాల్స్ వరకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి నేరుగా బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులు పంపే యూపీఐ పద్ధతే అత్యంత ప్రాచుర్యంలో ఉంది. యాపిల్ పే ఎలాంటి సేవలతో యూజర్స్‌ను ఆకట్టుకుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. తాజాగా సమాచారం ప్రకారం భారత్‌లో యాపిల్ పే ప్రారంభ దశలో ప్రధానంగా క్రెడిట్ కార్డుల ఆధారిత ట్యాప్ అండ్ పే సేవలతోనే రావచ్చని తెలుస్తోంది. ప్రాథ మికంగా యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డులతో ఈ సేవలు స్టార్ట్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకవేళ మొదటి దశలో క్యూఆర్ కోడ్ ఆధారిత యూపీఐ సదుపాయం లేకపోతే, నిత్యం చిన్న మొత్తాల లావాదేవీలు జరిపే సాధారణ యూజర్స్‌ను ఇది పెద్దగా ఆకర్షించలేకపోవచ్చనే అభిప్రాయాలు మార్కెట్ వర్గాల నుంచి వ్యక్తం అవుతున్నాయి. పైగా ఫోన్‌పే, గూగుల్ పేలు ఆండ్రాయిడ్, ఐఓఎస్ రెండింటిలోనూ పనిచేస్తుండగా, యాపిల్ పే కేవలం ఐఫోన్, యాపిల్ వాచ్ యూజర్లకు మాత్రమే పరిమితం కానుంది. యాపిల్ పే భారత్‌లో యూపీఐ సపోర్ట్‌తో కూడా రావచ్చని కొన్ని నివేదికలు పేర్కొంటున్నాయి. ఐఫోన్ వాడుతున్న ప్రీమియం కస్టమర్లు ఫోన్‌పే, గూగుల్ పేలకు బదులుగా ఇన్‌బిల్ట్‌గా ఉండే యాపిల్ పే వైపు మొగ్గు చూపే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. తొలి దశలో కేవలం క్రెడిట్ కార్డుల చెల్లింపులకే పరిమితమైతే, దేశీయ పేమెంట్ యాప్‌లకు తక్షణ ముప్పు లేకపోయినప్పటికీ, భవిష్యత్తులో యాపిల్ పే యూపీఐ సేవలపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తే మాత్రం భారత డిజిటల్ చెల్లింపుల రంగంలో తీవ్ర పోటీ నెలకొనడం ఖాయం.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.